నేటి దినపత్రిక
# సూర్య
కర్నూలు | నంద్యాల
బుధవారం | 14 ఫిబ్రవరి 2024 | పేజీలు 8



చదువుల తల్లి సరస్వతీదేవి

## చదువుల తల్లి
# సరస్వతీదేవి

- నేడు వసంత పంచమి

**మంత్రాలయం, మేజరున్యూస్ :** మాఘశుద్ధ పంచమినాడు వసంతపంచమి జరుపబడుతుంది. దీనిని శ్రీపంచమి అని, మదన పంచమి అనికూడా పిలుస్తారు. సరస్వతిమాత జన్మించిన రోజు మాఘశుద్ధ పంచమి. ఈ పండుగ యావ ద్భారతదేశంలో విశేషంగా జరుపుకుంటారు. ఈరోజు సరస్వతీదేవిని పూజించవలెను. అనంతరం రతీమన్మథులను పూజించి మిగతా 2లో



## ఆర్.ఎస్.ఎస్ కార్యకర్తలతో
# వికసిత భారతదేశం

- ఆర్.ఎస్.ఎస్.సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** ఆర్.ఎస్.ఎస్ హిందూ ధర్మం కోసం, దేశం కోసం పని చేస్తున్నదని ఆ సంస్థ సర్ సంఘ్ చాలక్ మోహన్‌భాగవత్ చెప్పారు. మంగళవారం కర్నూలు నగరంలోని మాంటెస్సోరి ఇండస్ పాఠశాల ఆవరణలో రాష్ట్రీయ స్వయం సేవక సంఘ్, కర్నూలు నగర శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన విశేష నగర సాంఘిక్‌ను ఉద్దేశించి భాగవత్ మాట్లాడారు. సమాజ ఉన్నతిలోనే మన ఉన్నతి అనే భావన మనసులో నింపుకొని డాక్టర్ హెడ్గేవార్ ఆర్‌ఎస్‌ఎస్‌ను స్థాపించారని, ఇదే భావన నేడు దేశమంతా వ్యాపించిందన్నారు. అయితే చాలామందిలో ఈ భావన ఇంకా అంతర్లీనంగా ఉంది. దీనిని బయటకు తీసుకురావాలి. ఈ సమాజం పట్ల దేశం పట్ల భక్తి నిర్మాణమై, వికసితమైతే శక్తి నిర్మాణం అవుతుందని ఆయన చెప్పారు. మన శ్రద్ధ నిష్టలను తగ్గించుకోకుండా అకుంఠిత దీక్షతో పనిచేయటం ద్వారా సుఖశాంతులతో తులతూగే వికసిత భారతం నిర్మాణం అవుతుందని ఆర్‌ఎస్‌ఎస్ సర్ సంఘ్ చాలక్ శ్రీ మోహన్ భగవత్ అన్నారు. శరీరాన్ని, మనసును, బుద్ధిని ఏకీకృతం చేసి సాధన చేయాలని పిలుపునిచ్చారు. సత్య, న్యాయ సమ్మతమైన ఈ మార్గంలో ధైర్యంగా, విచలితులం కాకుండా నడవాలని కార్యకర్తలను కోరారు. విద్యార్థులు, యువకులు, పెద్దలకు జరుగుతున్న సంఘ శాఖల ద్వారా బస్తీల వికాసం జరగాలని ఆయన ఆకాంక్షించారు. సమాజ హితం కోసం స్వయం సేవకులు పనిచేయాలని శ్రీ మోహన్ భగవత్ పిలుపునిచ్చారు. కర్నూలులోని ఇండస్ మిగతా 2లో



## నందికొట్కూరులో వైసీపీకి
# భారీ షాక్



మాట్లాడుతున్న చెరుకుచెర్ల రఘురామయ్య

- సీనియర్ నేత, రాష్ట్ర అదనపు కార్యదర్శి చెరుకుచెర్ల రఘురామయ్య పార్టీకి రాజీనామా
- పార్టీలో దళితులకు, బీసీలకు అన్యాయం

**కర్నూలు ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** నందికొట్కూరు నియోజకవర్గంలో వైసీపీకి భారీ షాక్ తగిలింది. నియోజకవర్గంలో సీనియర్ నేతగా, వైసీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఉన్న చెరుకుచెర్ల రఘురామయ్య మంగళవారం ఆ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన కర్నూలు నగరంలోని ఓ హోటల్‌లో విలేఖరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. పార్టీలో మిగతా 2లో

## గుడికల్లు కొండల్లో
# చిరుత పులి కలకలం..!

- కొన్ని రోజులుగా మేకలను హత మారుస్తున్న పులి
- ఘటన స్థలానికి చేరుకొని పులిని పట్టుకున్న ఫారెస్ట్ అధికారులు



వన్యప్రాణాల రక్షణ వాహనంలో తరలిస్తున్న అధికారులు

**ఎమ్మిగనూరుటౌన్, మేజర్‌న్యూస్ :** ఎమ్మిగనూరు మండలం గుడికల్లు కొండల్లో చిరుత పులి కలకలం రేపింది. కొండల్లో ఉన్న దాదాపు 10 మేక పిల్లలను పులి హతమార్చింది. మరో మేక పై దాడి చేస్తుండగా గమనించిన రైతులు కేకలు వేయడంతో ఆ పులి మేకను ఈడ్చుకుంటూ వెళ్లి కొండల్లో దాక్కుంది. ఆ కొండల్లో దాకున్న పులి ఎప్పుడు మిగతా 2లో



మాట్లాడుతున్న కలెక్టర్ జి.సృజన

## అర్హులైన జర్నలిస్టులకు
# ఇళ్ల స్థలాలు కేటాయింపు

- కర్నూలు జిల్లా కలెక్టర్ జి.సృజన

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి:** ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించే విధంగా చర్యలు చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ జి.సృజన పేర్కొన్నారు. మంగళవారం మిగతా 2లో

## బీజేపీ పల్లెబాట...
# ప్రజల్లోకి కేంద్ర పథకాలు 8లో

## వంట పాత్రలో పడి
# చిన్నారికి తీవ్ర గాయాలు 3లో

సూర్య





కార్యక్రమంలో పాల్గొన్న ఆర్.ఎస్.ఎస్ కార్యకర్తలు

### ఆర్.ఎస్.ఎస్ కార్యకర్తలతో

## వికసిత భారతదేశం

(మొదటిపేజీ తరువాయి)

స్కూల్లో జరిగిన ఈ సాంఘిక్ లో నగరంలోని 50 బస్తీల నుండి 1287 మంది స్వయంసేవకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఎస్ ఎస్ క్షేత్ర సంఘచాలక్ నాగరాజు, ప్రాంత సంఘచాలక్ హరి కుమార్ రెడ్డి, విభాగ్ సంఘచాలక్ నీలకంఠం, జిల్లా సంఘచాలక్ ఎన్ వి ఎస్ గుప్తా, నగర సంఘ చాలక్ శ చల్లా వాసు రెడ్డి పాల్గొన్నారు.

## నందికొట్కూరులో వైసీపీకి భారీ షాక్

(మొదటిపేజీ తరువాయి)

చేరింది మొదలు ఇప్పటి వరకు తగిన గుర్తింపు లేకుండా పోయిందన్నారు. పార్టీలోకి తాను తీసుకవచ్చిన వారికి ఇచ్చిన గుర్తింపు తనకు ఇవ్వడం లేదని ఆవేదనను వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి తండ్రి వైఎస్సార్ పట్ల ఉన్న అభిమానంతో వైసీపీలో ఇన్నాళ్లు కొనసాగానన్నారు. మాట తప్పను మడమ తిప్పను అన్న ముఖ్యమంత్రి మాట మడమ తిప్పారన్నారు. అన్ని విధాల ఎమ్మెల్యేగా అర్హలు కలిగిన నందికొట్కూరు సిట్టింగ్ ఎమ్మెల్యే ఆర్థర్‌కు సీటు కేటాయించకపోవడం తనను తీవ్ర మనస్తాపానికి గురిచేసిందన్నారు. ముఖ్యమంత్రిని నమ్ముకొని వెంట వచ్చిన దళితులు, బీసీల గొంతును కోశారన్నారు. అవినీతి నిలయంగా పాలన మారిందన్నారు. త్వరలో తన కార్యకర్తలతో 6మండలాల్లో వ్యక్తిగతంగా కానీ, సామూహికంగా కాని కలిసి చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. త్వరలోనే తన రాజకీయ కర్తవ్యాన్ని ప్రకటిస్తానన్నారు. ఈ సమావేశంలో సుబ్బరాయుడు, సుధాకర్‌రెడ్డి, మహేష్‌నాయుడు పాల్గొన్నారు.

### అర్హులైన జర్నలిస్టులకు

## ఇళ్ల స్థలాలు కేటాయింపు

(మొదటిపేజీ తరువాయి)

కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జర్నలిస్టుల ఇంటి స్థలాల మంజూరుకు సంబంధించి జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జీవోనెం.535లో పొందుపరచిన నిబంధనల ప్రకారం అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరుకు తగిన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ఐదేళ్ల అనుభవం కలిగిన 368మంది అక్రిడిటేటెడ్ జర్నలిస్టుల జాబితా సమాచార, పౌర సంబంధాల శాఖ ద్వారా వచ్చిందని, ఈజాబితాను మండలాల వారీగా విభజించి తహసీల్దార్లకు పంపించి వెరిఫికేషన్ చేయించడం జరిగిందన్నారు. అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌వో మధుసూదన్‌రావు, సమాచార శాఖ డీడీ జయమ్మ, కమిటీ మెంబర్ నాగిరెడ్డి, ఈసెక్షన్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, కల్లూరు, కర్నూలు రూరల్, కర్నూలు అర్బన్ తహసీల్దార్లు రామాంజులునాయక్, మోహన్‌కుమార్, మునివేలు పాల్గొన్నారు.

### నూతన విద్యా విధానాన్ని

## తక్షణమే రద్దు చేయాలి : ఏఐఎస్ఎఫ్

**బేతంచెర్ల మేజర్ న్యూస్ :** నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు యన్న ఉదయ్, మండల నాయకులు ప్రదీప్ ,నందవిశ్వనాథ్, విజయ్ ల ఆధ్వర్యంలో బేతంచర్ల పట్టణంలోని పాఠశాలల, కళాశాల నందు విద్యార్థులతో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు .అనంతరం వారు మాట్లాడుతూ విద్యారంగంలో వస్తున్న సమూల మార్పులపై పోరు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన విద్యా విధానం తీసుకొచ్చి విద్యా వ్యవస్థను నాశనం చేసి పేద బడుగు బలహీన వర్గ విద్యార్థులను విద్యకు దూరం చేసే విధంగా ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. దేశ అక్షరాస్యతను నీరుగార్చి నిరుద్యోగాన్ని మరింత పెంచే విధంగా నూతన విద్యా విధానం ఉందన్నారు.ఒకవైపు ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తూ కార్పొరేటు శక్తులకు ఊడిగం చేస్తున్నారని మోడీ హయాంలో రాజ్యాంగాన్ని అపహస్యం చేసే విధానాలు, మతోన్మాదాన్ని బీజేపీ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదన్నారు. తక్షణమే మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.లేని యడల రాబోయే ఎన్నికలలో ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో భాను, ప్రకాష్ ,రమేష్ ,సిద్దు, జగదీష్ ,రియాజ్, ప్రదీప్ , తదితరులు పాల్గొన్నారు.

### మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్‌లను

## తక్షణమే పరిష్కరించాలి

**నంద్యాల రూరల్, మేజర్‌న్యూస్ :** మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్‌లను తక్షణమే పరిష్కరించి జిఓను అమలు చేయాలని మంగళవారం నంద్యాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏఐటియుసి ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ చైర్మెన్ షేక్ మాబున్నిసాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ పాదయాత్ర సమయంలో కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని అప్పటి ప్రతిపక్ష నేత జగన్మోహన్‌రెడ్డి హామీలు ఇవ్వడం జరిగిందని కానీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ హామీని మరిచిపోయారని అన్నారు. వెంటనే పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అన్నారు. షేక్ మాబున్నిసా మాట్లాడుతూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు ప్రసాద్, అధ్యక్షులు రంజిత్‌కుమార్, కార్యదర్శి ప్రసాద్, జయమ్మ, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

# గుడికల్లు కొండల్లో చిరుత పులి కలకలం..!



వలలో చిక్కుకున్న పులి దృశ్యం

(మొదటిపేజీ తరువాయి)

దాడి చేస్తుందోనని గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. అయితే గత కొన్ని రోజుల క్రితం మేకలు చనిపోతుండగా పులి సంచరిస్తున్నట్టు అనుమానం వచ్చి గతంలోనే ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చామని అయినా అధికారులు మాత్రం పట్టించుకోలేదని గ్రామస్తులు తెలిపారు. కొంతమంది రైతులు ఆ పులి కోసం వలలు కూడా ఏర్పాటు చేశారు. రైతులు ఏర్పాటు చేసిన వలలో మంగళవారం తెల్లవారుజామున పులి కాలు చిక్కొని పడింది. కొండల్లో ఉన్న చిరుత స్పష్టంగా కనపడడంతో ఫారెస్ట్ అధికారులకు గ్రామస్తులు సమాచారం అందించారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న ఫారెస్ట్ అధికారులు చిరుత పులిని బోనులో బంధించి ఇక్కడి నుండి తరలించేందుకు చర్యలు చేపట్టారు. పులిని ఎట్టకేలకు జిల్లా ఫారెస్ట్



పట్టుబడిన పులిని పరిశీలిస్తున్న వైసీపీ ఇంచార్జి బుట్టా రేణుక

ఆఫీసర్ శివ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మకూరు నుండి ఓ రిస్క్యూ టీం ను రప్పించి ఆ చిరుత పులి కు మత్తు ఇంజక్షన్ వేసి బందించి వైద్యులు పరీక్షించారు. మెరుగైన చికిత్స అవసరం కావడంతో వెంటనే వన్యప్రాణ రక్షణ వాహనంలో వైద్యుల పర్యవేక్షణతో తిరుపతికి తరలించారు. ఈ పులిని చూడడానికి చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చారు. భారీ పోలీసుల మధ్య పట్టుకున్న పులిని వన్యప్రాణాల రక్షణ వాహనంలో తరలించారు.ఎంతో చాకచక్యంగా ఫారెస్ట్ అధికారులు పులిని పట్టుకోవడంతో అధికారులను నియోజకవర్గ వైసీపీ ఇంచార్జి బుట్టా రేణుక అభినందించారు.

# మున్సిపల్ మార్కెట్ వేలాల్లో సిండికేట్..!

**- గత ఏడాది కంటే**
**కేవలం రూ. 4.86 లక్షల ఆదాయం**

**- వారపు మార్కెట్ వేలాలు వాయిదా**

**ఎమ్మిగనూరు, మేజర్ న్యూస్:** మున్సిపల్ మార్కెట్ వేలాల్లో కాంట్రాక్టర్లు సిండికేట్ కావడంతో మునిసిపాలిటీకి వచ్చే భారీ ఆదాయానికి గండిపడింది. మంగళవారం మధ్యాహ్నం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డి ఆధ్వర్యంలో మార్కెట్ వేలాలను నిర్వహించారు. అయితే కాంట్రాక్టర్లు ముందుగానే మిలాఖాత్ అవడంతో మున్సిపాలిటీకి గత ఏడాది కన్నా కేవలం రూ.4.86 లక్షలు మాత్రమే ఆదాయం సమకూరింది. ఐదు మార్కెట్లకు వేలాలు జరగ్గా రూ.61,49,000 వేలు మున్సిపాలిటీకి వచ్చాయి. రోజు వారి మార్కెట్ ను రూ.27,57,000లకు డి. మునీర్ దక్కించుకున్నారు. వారపు పశువుల మార్కెట్ ను రూ. 15, 62,000 లకు బి.రామకృష్ణ, గొర్రెల మార్కెట్ ను రూ.



వేలాలు నిర్వహిస్తున్న దృశ్యం

15,66,000 లకు యస్.రాము, మాంసపు మార్కెట్ ను రూ.1,35,000 లకు రహిమాన్ సాబ్, గొర్రెల కమేలా ను రూ. 1,29,000లకు హనీఫ్ లు దక్కించు కున్నారు. వారపు కూరగాయల మార్కెట్ మాత్రం వాయిదా పడింది. కార్యక్రమంలో మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ బేబి, ఏ-1 క్లర్క్ నరసన్న, ఆర్ఐ లు సూరిబాబు, రాజు, పాటా దారులు పాల్గొన్నారు.

# చదువుల తల్లి సరస్వతీ దేవి

(మొదటిపేజీ తరువాయి)

మహోత్సవమొనరించవలెనని, దానములు చేయవలెనని, దీనివలన మాధవుడు(వసంతుడు) సంతోషించునని నిర్ణయామృతరారుడు తెలిపాడట. చదువుల తల్లి సరస్వతీదేవిని మాఘపంచమి నాడు శ్రీపంచమి పేరిట ఆరాధిస్తారు. సర్వవిద్యలకు ఆధారం వాగ్దేవే కనుక చిన్నాపెద్ద తేడాల్లేకుండా పంచమి రోజున పుస్తకాలు, కలాలు అమ్మవారి దగ్గర పెట్టి ఆరాధిస్తారు. సంగీత, నృత్య, సాహిత్యాలకు కూడా ఈదేవియే మూలం కనుక ఈ తల్లిని నృత్యకేళీవిలాసాలతో స్తుతిస్తారు. ఈ పంచమినే వసంతపంచమి అని మదన పంచమి అని అంటారు. ఈ తల్లిని జ్ఞానప్రాప్తికోసం ఆరాధించమని బ్రహ్మవైవర్తపురాణం చెబుతోంది. ఈపంచమి నాడు సరస్వతిని ఆరాధించే విధివిధానాలను నారదునకు శ్రీమహావిష్ణువు వివరించినట్లు దేవీభాగవతం ద్వారా తెలుస్తోంది. మాఘమాసం శిశిర ఋతువులో వసంతుని స్వాగత చిహ్నంగా ఈపంచమిని భావిస్తారు. ఋతురాజు వసంతుడు కనుక వసంతునికి ప్రేమను కలిగించేవాడు మదనుడు కనుక మదనుణ్ణి అనురాగవల్లి అయిన రతీదేవిని ఆరాధన చేయటం కూడా శ్రీపంచమినాడే కనిపిస్తుంది. వీరి ముగ్గురుని పూజించడం వల్ల వ్యక్తుల మధ్య ప్రేమాభిమానాలు కలుగుతాయి. దానివల్ల జ్ఞానప్రవాహాలు ఏర్పడతాయి. అమ్మ దగ్గర అక్షరాభ్యాసం చేయిస్తే పిల్లలు జ్ఞానరాసులు అవుతారు. సరస్వతీదేవి ఆరాధన వల్ల వాక్శుద్ధి కలుగుతుంది. అమ్మ కరుణతో సద్బుద్ధిని పొందుతారు. మేధ, ఆలోచన, ప్రతిభ, ధారణ, ప్రజ, స్ఫురణ శక్తుల స్వరూపమే శారదాదేవి. అందుకే ఈదేవిని శివానుజ అని పిలుస్తారు. శరన్నవరాత్రులలో మూలానక్షత్రం రోజున సరస్వతీ రూపంలో దుర్గాదేవిని ఆరాధించినప్పటికీ మాఘమాసంలో పంచమి తిథినాడు సరస్వతీదేవికి ప్రత్యేక ఆరాధనలు, విశే షపూజలు చేస్తారు. 'చంద్రికా చంద్రవదనా తీవ్ర మహాభద్రా మహామలా భోగదా భారతీ భామా గోవిందా గోమతీ శివా' ప్రతిరోజుగానీ పంచమినాడు సప్తమీ తిథుల్లో కానీ సరస్వతి జన్మనక్షత్రం రోజున గానీ పూజించిన వారికి ఆతల్లి కరుణాకటాక్షాలు పుష్కలంగా లభిస్తాయి.

అహింసకు అధినాయక సరస్వతి దేవి. సరః అంటే కాంతి, కాంతినిచ్చేది కనుక ఆమె సరస్వతి అయ్యింది. అజ్ఞానతిమిరాంధకారాన్ని దూరం చేసి విజ్ఞాన కాంతి పుంజాన్ని వెదజల్లే దేవత సరస్వతి. ఈ అహింసామూర్తిని తెల్లని పద్మములో ఆసీనురాలై వీణ, పుస్తకం, జపమాల, అభయముద్రలను ధరించి ఉంటుంది. ఈమె అహింసామూర్తి కనుకనే ఈ తల్లి చేతిలో ఎటువంటి ఆముధాలు ఉండవు. జ్ఞానకాంతిని పొందినవారికి ఆయుధాల అవసరం ఉండదు కదా. ఈ తల్లిని తెల్లని పూవులతోను, శ్వేత వస్త్రాలతోనూ, శ్రీగంధంతోనూ అలంకరిస్తారు.

పచ్చని లేదా తెల్లని వస్త్రాలను ధరించి తెల్లని పూలతో అర్చనాదులు చేసి క్షీరాన్నాన్ని, నేతితో కూడిన వంటలను, నారికేళము, అరటి పళ్ళను, చెరకుగడలను నివేధన చేస్తారు. ఈతల్లి చల్లనిచూపులతో అపార విజ్ఞానరాశిని పొందవచ్చు. వాగ్వేశ్వరీ, మహాసరస్వతి, సిద్ధసరస్వతి, పరాసరస్వతి, బాలసరస్వతి' ఇలా అనేక నామాలు ఉన్నప్పటికీ 'సామాంపాతు సరస్వతి అని పూజించేవారు ఆతల్లికి ఎక్కువ ప్రేమపాత్రులట. సరస్వతీదేవిని ఆవాహనాది షోడశోపజారాలతో పూజించి సర్వవేళలా సర్వవస్థలయందు నాతోనే ఉండుమని ప్రార్థిస్తారు. వ్యాస, వాల్మీకాదులు కూడా ఈ తల్లి అనుగ్రహంతోనే వేదవిభజన చేయటం, పురాణాలు, కావ్యాలు, గ్రంథాలు రచించడం జరిగిందంటారు. పూర్వం అశ్వలాయనుడు, ఆదిశంకరాచార్యులు కూడా ఈ తల్లిని ఆరాధించారట. ఇంతటి విశిష్టత కల్గిన సరస్వతీమాత సర్వజ్ఞనప్రధాయినిగా అలరారుతోంది. ఆమెను స్తుతించే పవిత్రమైన, పుణ్యప్రదమైన పర్వదినం వసంతపంచమి.

# పేద ప్రజల ఆరోగ్యం కోసమే ఆరోగ్య సురక్ష


సురక్ష కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి

**బనగానపల్లెమేజర్,న్యూస్‌:** పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతున్నట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకట రమణ తెలిపారు. బనగానపల్లె మండల పరిధిలోని కైప గ్రామంలో ఆరోగ్య సురక్ష ఫేస్ – 2 కార్యక్రమాన్ని డాక్టర్ శివశం కరుడు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టిందని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ జగదీష్ రెడ్డి, మెడికల్ ఆఫీసర్ శివశంకరుడు, యు.ఆర్డీ ప్రసాద్, ఈ.వొ ఖలీల్, కైప వైసీపీ నాయకులు ప్రతాప్ రెడ్డి, ఎ.ఎన్.ఎంలు, ఎంల్.హెచ్.పిలు మరియు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# వైఎస్సార్ ఆసరాతో అక్కా,చెల్లెమ్మలకు ఆర్థిక భరోసా

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** వైఎస్సార్ ఆసరాతో అక్కా,చెల్లెమ్మలకు ఆర్థిక కల్పించిన ఏకైక వ్యక్తి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పొదుపు లక్ష్మిభవన్ ఆవరణ ఎంపీడీవో డి.మల్లేశ్వరి అధ్యక్షతన డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా నాలుగో విడత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం నాలుగు విడతలుగా డ్వాక్రా మహిళలకు 2019నాటికి బ్యాంకుల్లో ఉన్న అప్పులను వైఎస్సార్ ఆసరాతో వారి గ్రూపులోని అప్పులను ప్రభుత్వం నాలుగు విడతలుగా రుణాన్ని చెల్లిస్తుందన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలకు 793గ్రూపులకు రూ.5.29కోట్లు అందజేశారు. వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు మార్కెట్‌యార్డు చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, జడ్పీటీసీ రంగనాథ్‌గౌడ్, ఎంపీపీ తిప్పన్న, వైస్ ఎంపీపీ పద్మనాభరెడ్డి, సచివాలయాల జేసీఎస్ కన్వీనర్ లోటరీబాష, సర్పంచ్ నాగేశ్వరమ్మ, ఏపీఎం వెంకటరామిరెడ్డి, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


చెక్కు అందజేస్తున్న దృశ్యం

# అవినీతి లేని పాలన అందిస్తా: టీజీ భరత్


మాట్లాడుతున్న టీజీ భరత్

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి :** కర్నూలు ప్రజలకు అవినీతి లేని పాలన అందిస్తానని కర్నూలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. కర్నూలు నగర శివారులోని అశోక ఉమెన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆయన విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. యువత కలలు సాకారం కావలలాంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలన్నారు. విజన్ ఉన్న చంద్రబాబు నాయకత్వంలో కర్నూలుకు ఒక విజన్ పెట్టుకొని తాను రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. తాను గెలిచిన తర్వాత కర్నూలుకు తీసుకవచ్చే పరిశ్రమల వల్ల భవిష్యత్తు తరాల మొత్తం లబ్ధి చెందుతాయన్నారు. యువత ఆలోచించి వచ్చే ఎన్నికల్లో తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధినేత అశోక్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

# మెగా డీఎస్సీ అంటూ దగా చేస్తున్న జగన్

**– కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యులు లక్ష్మీనరసింహ**

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** జాబ్ క్యాలెండర్‌తో మీ చేతుల్లో ఉద్యోగాలు అంటూ నిరుద్యోగులతో నమ్మబలికి అధికారం చేపట్టగానే తనకేమీ పట్టనట్లు...ఇప్పుడేమో ఏమీ తెలియనట్లు మరోసారి ఎన్నికలు రాబోతున్నాయని మెగా డిఎస్సీ అంటూ నిరుద్యోగులను సీఎం జగన్మోహన్‌రెడ్డి దగా చేస్తున్నాడని నంద్యాల కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ జిల్లా డీసీసీ, ఏఐసీసీ మెంబర్ లక్ష్మీనరసింహ యాదవ్ ధ్వజమెత్తారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహానేత వైయస్ రాజశేఖర్‌రెడ్డి 52వేల పోస్టులతో మెగా డిఎస్పీ వేస్తే...ఆయన వారసుడుగా చెప్పుకొనే జగన్ 6వేలతో వేసింది దగా డిఎస్సీ అని ఎద్దేవా చేశారు. 2019 ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లు 25వేల టీచర్ పోస్టుల భర్తీ ఎక్కడ అని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు 6వేల పోస్టుల భర్తీ చేయడంలో ఆంతర్యం ఏమిటని ఇది నిరుద్యోగులను మోసం చేయడమే అన్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన 30రోజుల్లో పరీక్షలు పెట్టడం దేశంలో ఎక్కడైనా ఉందా టెట్‌కు 20రోజులు తరువాత డిఎస్సీ మధ్య కేవలం 6రోజుల వ్యవధినా అన్నారు. వైయస్సార్ హయాంలో 100రోజులగడువు ఇచ్చిన సంగతి వారసుడు జగన్‌కు గుర్తు లేదా అన్నారు. ఇచ్చిన సిలబస్ ప్రకారం ఒక్కో అభ్యర్థి 150పుస్తకాలు చదవాలని మీకు తెలియదా, రోజుకు 5పుస్తకాలు చదవడం అభ్యర్థులకు సాధ్యపడే పడుతుందన్నారు. మానసిక ఒత్తిడికి గురిచేసి నిరుద్యోగులను పొట్టన పెట్టుకోవాలని కుట్ర చేస్తున్నారి ఇదికక్ష సాధింపు చర్య కాదా అన్నారు. నవరత్నాలు, జాతిరత్నాలు అని చెప్పుకొనే జగన్ ఆయన చుట్టూ ఉండే సకలం శాఖా మంత్రులు ఈ ప్రశ్నలకు దమ్ముంటే సమాధానం చెప్పాలన్నారు.


మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ యాదవ్

# శ్రీమఠంలో పరమపూజ్య శ్రీసుజయీంద్రతీర్థుల రథోత్సవం

**మంత్రాలయంమేజరున్యూస్‌:**

మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల నేతృత్వంలో పరమపూజ్య శ్రీసుజయీంద్రతీర్థుల రథోత్సవం వైభవంగా నిర్వహించబడింది. శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు పరమపూజ్య శ్రీసుజయీంద్ర తీర్థుల బృందావనానికి జల, క్షీర, పంచామృతాభిషేకాలు నిర్వహించబడ్డాయి. అనంతరం శ్రీసుజయీంద్రతీర్థుల బృందావనాన్ని వివిధ రకాల పూమాలలతో అలంకరించి విశిష్టపూజలు నిర్వహించారు. అనంతరం శ్రీమఠం ప్రాంగణంలో పరమపూజ్య శ్రీసుజయీంద్ర తీర్థుల చిత్రపటాన్ని సువర్ణ రథంలో ఉంచి పూజలు నిర్వహించిన తర్వాత రథోత్సవం శ్రీమఠం ప్రాంగణంలో వైభవంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీమఠం పండితులు, స్థానికులు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు.


పరమపూజ్య శ్రీసుజయీంద్రతీర్థుల రథోత్సవం

# అటెండెన్స్, విద్య బోధనలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలి


మాట్లాడుతున్న డాక్టర్ వెంకటరంగారెడ్డి

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** ఆసుపత్రిలో, కళాశాలలో వైద్య విద్యార్థుల తరగతి హాజరు అటెండెన్స్, విద్య బోధనలపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి అన్నారు. మంగళవారం జీజీహెచ్‌లోని ధన్వంతరి హాల్‌లో హెచ్‌ఓడీలతో సమావేశం నిర్వహించారు. ఇచ్చిన టార్గెట్లు పూర్తి చేశారని అభినందించార. ఆసుపత్రిలోని సర్జికల్ అంకాలజీ, మెడికల్ అంకాలజీలకు సపరేటుగా ఓపీలు ఇవ్వాలని సిబ్బందికి ఆదేశించారు. ఆసుపత్రిలోని ఎఫ్ఎంసీ విభాగంలో మెడికల్ అంకాలజీలో 10పడకల విభాగం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సుధాకర్, శ్రీహరి, వేంకటేశ్వరరావు, హేమనళిని, రాధారాణి, రాజశేఖర్, ఇక్బాల్‌హుసేన్, శ్రీనివాసులు, శివబాలనగాంజన్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

# బూత్ కమిటీలను త్వరగా ఏర్పాటు చేయండి

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** బూత్ కమిటీలను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె.బాబురావు అన్నారు. మంగళవారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నగర కాంగ్రెస్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ బూత్‌ల వారీగా బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ఒక్కో పోలింగ్ బూత్‌కు ఇద్దరు చొప్పున ఎంపిక చేసి వారి పేర్లు, సెల్ నెంబర్లను త్వరగా పూర్తి చేసి జిల్లా కార్యాలయానికి పంపాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు జాన్‌విల్సన్, బతుకన్న, వెంకటరెడ్డి, రియాజుద్దీన్, పోతుల శేఖర్, భరత్‌కుమార్‌ఆచారి, సత్యనారాయణగుప్తా, చంద్రశేఖర్, షేక్‌నవీద్, కొత్తపేట మున్నా, లాజరస్, ప్రమీల, వెంకటసుజాత, షేక్‌ఖాజాహుసేన్, ఎజాస్‌అహ్మద్, సుబ్రమణ్యం, అబ్దుల్‌హై, ఖాద్రిపాష, షేక్‌మాలిక్‌బాష పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బాబురావు

## వంట పాత్రలో పడి

# చిన్నారికి తీవ్ర గాయాలు


గాయపడ్డ చిన్నారి జయసింహ

**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన చాగలమర్రిలోని కోటగడ్డ వీధిలో మంగళ వారం ఇంట్లో వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు నాలుగు సంవత్సరాల చిన్నారి జయసింహ వంట పాత్రలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబీకులు హుటాహుటి న స్థానిక కేరళ వైద్యాశాలకు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం నంద్యాలకు తరలించినట్లు కుటుంబీకులు తెలిపారు.

# రైతాంగాన్ని ఆదుకోవడంలో బిజెపి ప్రభుత్వం విఫలం

**– ఆదాని, అంబానీలకు ఊడిగం చేస్తున్న మోడీ – సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ**


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి

**పత్తికొండ టౌన్, మేజర్ న్యూస్ :** రైతాంగాన్ని ఆదుకోవడంలో బిజెపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. మంగళవారం పత్తికొండలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రామచంద్రయ్యతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మోడీ ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నేరవేర్చడంలో పూర్తిగా విఫలం అయ్యారన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వ రంగ సంస్థలను అంభానీ, ఆదానీలకు అప్పనంగా అప్పగిస్తూ, కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తున్నారన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. పంట పెట్టుబడికి రైతులు తీసుకున్న బ్యాంకు రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. డాక్టర్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలన్నారు. సీఎం జగన్ పాలనలో రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందన్నారు. జగన్ 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో వైసీపీ గెలుస్తోందని ప్రగల్భాలు పలుకుతూ, మంత్రులు, ఎమ్మెల్యేలు పోటీ చేసే అసెంబ్లీ నియోజకవర్గ పార్లమెంట్ స్థానాలను మార్పులు చేయడాన్ని తప్పు పట్టారు. మోడీ, జగన్ దురహంకార పాలనకు చరమ గీతం పాడాలన్నారు. కేంద్ర కార్మిక సంఘాలు, సంయుక్త కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో ఈనెల 16న తలపెట్టిన గ్రామీణ భారత్ బంద్‌కు సీపీఐ సహకారం అందిస్తుందని, గ్రామీణ రైతులు, వ్యవసాయ కూలీలు, పట్టణ కార్మిక కర్షకులు, విద్యార్థి యువజన సంఘాలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి కర్నూలు జిల్లా సీపీఐ మాజీ కార్యదర్శి భీమలింగప్ప, మండల కార్యదర్శి రాజాసాహెబ్, పట్టణకార్యదర్శి రామాంజనేయులు, పాల్గొన్నారు.

# ఆర్డర్ కాపీ లేకుండా జీతాలు ఎలా చెల్లిస్తారు

**కర్నూలు ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్ :** రద్దు అయిన డిపార్ట్‌మెంట్ ఉద్యోగుకలు జీతాలు ఎలా చెల్లిస్తారని ఆర్‌పీఎస్ఎఫ్ జిల్లా అధ్యుడు నాగరాజు, యూనివర్సిటీ సెక్రటరీ నాగేంద్ర, సాద్విక్, హంసవర్ధన్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం రాయలసీమ యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్‌కు వినతి పత్రం అందజేశారు.వారు మాట్లాడుతూ ఆర్డర్ కాపీ లేకుండా డిపార్ట్‌మెంట్ ఉద్యోగులకు జీతాలు ఎలా చెల్లిస్తారన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. న్యాయపోరాటానికి సిద్ధమన్నారు. ఈకార్యక్రమంలో ఆర్‌పీఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గుడి నిర్మాణానికి రూ.20 వేలు విరాళం



**పాములపాడు, మేజర్ న్యూస్ :** జూటూరు గ్రామంలో నిర్మిస్తున్న జమ్ములమ్మ నూతన గుడి నిర్మాణానికి వేంపెంట సొసైటీ చైర్మన్ మచ్చ వెంకట స్వామి, వైస్సార్సీపీ జేసీఎస్ మండల ఇన్చార్జి టీఎన్అర్ నాగరాజు రూ.20 వేలు విరాళాన్ని జూటూరు గ్రామ పెద్దలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ యువజన విభాగ మండల అధ్యక్షుడు బత్తినిచరణ్కుమార్,మనోహర్ చిన్నఈశ్వరయ్య, మౌలాలి, చిన్న మద్దిలేటి, వెంకటరమణ, పాల్గొన్నారు.

# ఐఐటీ విద్యార్థి అభిజిత్‌ను అభినందించిన కేశవరెడ్డి



అభిజత్‌ను అభినందిస్తున్న కేశవరెడ్డి

**కర్నూలుస్పోర్ట్స్, మేజర్న్యూస్ :** నగరంలోని వెంకట రమణకాలనీలని కేశవరెడ్డి పాఠశాలలో మంగళవారం పూర్వ విద్యార్థి అయిన కె.అభిజిత్‌ను సన్మానిస్తూ ఘనంగా అభినందన సభ నిర్వహించారు. కేశవరెడ్డిలో 2014లో ఐఐటీ, మెడిసిన్ ఫౌండేషన్ కోర్సు లో చదివిన కె.అభిజిత్ అస్సాంలోని గౌహతిలో ఐఐటీ పూర్తి చేసుకొని అడోబ్ కంపెనీలో జాబ్ చేస్తూ 2024 సంవత్సరానికి గాను అడోబ్ కంపెనీ వారు అంతర్జాతీయంగా కేవలం నలుగురికి మాత్రమే అందించే యంగ్ ఇంజనీరింగ్ అవార్డుకు ఎన్నికై రూ.60లక్షల క్యాష్ ప్రైజ్‌ను సాధించిన సంద ర్భంగా అభిజిత్ సత్కరించారు. కృషితో నాస్తి దుర్భిక్షం అన్న చందానికి నిలువెత్తు రూపం మన అభిజిత్ అన్నారు. ఈ కార్యక్రమంలో అభిజిత్ తల్లిదండ్రులు నరేంద్ర, పార్వతి, విద్యార్థతలు, ఉపాధ్యాయులు, యాజమాన్య సిబ్బంది పాల్గొన్నారు.

# జేఈఈ ఫలితాల్లో సత్తా చాటిన ఎస్ఆర్ కాలేజ్ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న జోనల్ ఇన్‌చార్జి రఘువీర్

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్న్యూస్ :** దేశవ్యాప్తంగా మంగళవారం విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫేస్-1 పరీక్షల్లో నగరానికి చెందిన ఎస్ ఆర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఎస్ఆర్ కళాశాల జోనల్ ఇన్ చార్జి టి.రఘువీర్ విద్యార్థులను అభినందించారు. శ్రీరామక్రిష్ణ(98.2), బత్తుల రాజేష్(98.01), ప్రహ్లాదరెడ్డి(96.87), తేజేశ్వర కార్తికేయమూర్తి(96.23), సాయితేజశ్రీ(95.59), కె.హన్విక(94.60), చరణ్‌తేజ్(93.63), సాయిసృజన్(92.36), జయరంగారెడ్డి(92.02) మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు.

# భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో తెదేపాలో 30 కుటుంబాలు చేరిక



భూమా అఖిలప్రియ ఆధ్వర్యంలో తెదేపాలో చేరిన దృశ్యం

**ఆళ్లగడ్డ ,మేజర్ న్యూస్ :** తెదేపాలో చేరికలు జోరుగా కొనసాగుతున్నాయి. మండలంలోని కోటకొందుకూరు గ్రామానికి చెందిన 30 కుటుంబాల వారు మాజీ మంత్రి భూమా అఖిలప్రియ సమక్షంలో మంగళవారం తెదేపాతీర్థం పుచ్చుకున్నారు. ఆదినారాయణ, బాల దాసరి, జ్వాలా మరియు వారి అనుచరుర్గం మొత్తం 30 కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీలో చేరడం జరిగింది. వారిని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ , భార్గవరామ్ దంపతులుతెదేపా కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. కోట కందుకూరు టిడిపి నాయకులు ఆళ్ల నాగ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వీరంతా తెదేపాలో చేరడం జరిగింది. మాజీ జెడ్పిటిసి చాంద్బాషా ,కాంట్రాక్టర్ నన్నెభ్ గారి జిలా ని లు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల్లో సమస్యలు లేకుండా చూస్తాం

**- జూపాడుబంగ్లాలో మహిళా ఓటర్లు ఎక్కువ**

**- తహశీల్దార్ బాబు రాజేంద్ర ప్రసాద్**



తహశీల్దార్ బాబు రాజేంద్ర ప్రసాద్

**జూపాడుబంగ్లా , మేజర్న్యూస్ :**

జూపాడుబంగ్లా మండల కేంద్రంలో త్వరలో జరుగనున్న సాధారణ ఎన్నికలకు 33 పోలింగ్ కేంద్రాలను గుర్తించామని పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూస్తామని తహశీల్దార్ బాబు రాజేంద్ర ప్రసాద్ అన్నారు. మంగళవారం తహశీల్దార్ కార్యాలయంలో విలేఖరులతో ఆయన మాట్లాడుతూ జూపాడుబంగ్లా మండలంలో మొత్తం ఓటర్లు 29,637 మంది ఓటర్లు ఉన్నారని, అందులో పురుషులు 14,772, స్త్రీలు 15,164 మంది ఓటర్లు ఉండగా వీరిలో మహిళలే దాదాపు 692 మంది మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారని, ఒక ట్రాన్స్‌జెండర్ ఉన్నారని తెలిపారు. 33 పోలింగ్ కేంద్రాలకు 33 మంది బిఎల్ఓలను, నలుగురు సూపర్‌వైజర్లను ఏర్పాటు చేశామని, ఓటర్లు ఏమైనా సమస్యలు ఉంటే బిఎల్ఓలకు తెలియజేస్తే వారు మా దృష్టికి తీసుకొని వస్తారన్నారు. అలాగే ప్రధానంగా పోలింగ్ కేంద్రాల వద్ద నీటి సరఫరా, విద్యుత్, టాయిలెట్, దివ్యాంగులకు రాంప్ సౌకర్యం ఏర్పాటు చేసి ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహశీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ రంగారెడ్డిలు పాల్గొన్నారు.

# అభివృద్ధి చేసినందుకు జైలుకు పంపిస్తారా..ఎమ్మెల్యే గంగుల

**న్యాయం కోసం వస్తే డబ్బులు లాక్కునే నీచ సంస్కృతి కాదు మాది : గంగుల**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసినందు కానన్ను, మా తండ్రిగారైన గంగుల ప్రభాకర్ రెడ్డిని అరెస్టు చేస్తారాఅని ఆళ్లగడ్డ శాసనసభ్యులు గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో జగనన్న నాలుగో విడత ఆసరా పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాట్లాడారు. ఈసందర్భంగా మహిళలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ మండలంలోని 318 గ్రామ ఐక్య సంఘాలకు 1 కోటి 64 లక్షల ఆసరా చెక్కును విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ న్యాయం కోసం వచ్చిన వ్యక్తి నుంచి డబ్బులు లాక్కునే నీచ సంస్కృతి ఎవరిది అయింది ప్రజలకు తెలుసు అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో మహిళలకు అన్ని విధాల చేదోడువాదోడుగా ఉండి ఆర్థికంగా నిలబడే విధంగా చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతే ఆ కుటుంబాలు అన్ని విధాల అభివృద్ధిలోకి వస్తాయని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పలు సంక్షేమ పథకాలు మహిళలకే మంజూరు చేశారన్నారు. పొదుపు లక్ష్మి మహిళలకు వడ్డీ మాఫీ చేయూత, ఇంటి స్థలాలు రేషన్ కార్డులు మహిళల పేర్లపైనే తమ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. మరి ముఖ్యంగా విద్యార్థులకు చదువుకు సంబంధించిన అమ్మ ఒడి పథకం ద్వారా ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని కూడా పిల్లల తల్లుల పేర్ల బ్యాంకు ఖాతాలో వేయడం జరుగుతుందన్నారు. నాలుగు విడతలుగా 6 కోట్ల55 లక్షల 33 వేల 206 రూపాయలను అందించారన్నారు. 3229 మంది సభ్యులు గత నాలుగేళ్ల నుండి లబ్ధి పొందారన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం ఎలాంటి పథకాలు అమలు చేయలేదని విమర్శించారు. కేవలంఎన్నికలు వస్తేనే టిడిపి నాయకులకు ప్రజలు గుర్తుకొస్తారని వారు విమర్శించారు. ఆస్తులు ఆక్రమించుకున్న వారి జాబితాలలో ఎవరు ఉండేది అనేది ఆళ్లగడ్డ నియోజకవర్గ ప్రజలకు తెలుసు అని పాత కందుకూరు రోడ్డు వెంబడి ఉండే 250 ఎకరాల అన్ని కులాలకు సంబంధించిన రైతుల భూములను ఎవరు ఆక్రమించుకున్నారో తాలూకా ప్రజల అందరికీ తెలుసునన్నారు. రుద్రవరం కు చెందిన మైనారిటీలు న్యాయం కోసం వస్తే కోటి 30 లక్షల రూపాయలు బలవంతంగా లాక్కొని కోట్టి పంపించిన చరిత్ర ఎవరిదో అర్థంచేసుకోవాలన్నారు. కిడ్నాపుల ఘనత ఎవరిదో ప్రజలకు బాగా తెలుసునని వారు వ్యాఖ్యరించారు. గంగుల కుటుంబం యొక్క మంచితనం నియోజకవర్గ ప్రజలకే కాక రాష్ట్ర ప్రజలకు తెలుసునన్నారు. ఈ ప్రభుత్వంలో మంచి జరిగి ఉంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి తిరిగి ఓటు వేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వీరభద్రుడు,జిల్లా జెసిఎస్ కోఆర్డినేటర్ షేక్ బాబులాల్,మండల కన్వీనర్ కుమార్ రెడ్డి, చాగలమర్రి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ తులసమ్మ, జడ్పిటిసి లక్ష్మీదేవి, మహిళా సాధికారిక సంస్థ డైరెక్టర్ బాలవిద్య, మండల ఉపాధ్యక్షుడు ముల్లా రఫీ, సింగిల్ విండో అధ్యక్షుడు దస్తగిరి, సీనియర్ నాయకులు గొడిగనూరు ఎంపిటిసి పత్తి నారాయణ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ముల్లా జాబిర్, ఎంపీడీవో సూర్యనారాయణ రెడ్డి, తహసిల్దార్ రమణమ్మ, వెలుగు ఏరియా కోఆర్డినేటర్ దానం, ఏపీఎం నాగమ్మ, వైసిపి నాయకులు జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గణేష్ రెడ్డి, రామగురిగిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి,ఎంపీటీసీలు లక్ష్మిరెడ్డి, ఫయాజ్, సర్పంచులు బంగారు షరీఫ్, ప్రతాప్ రెడ్డి, గోవిందయ్య, శేషు రమేష్, పవన్ కుమార్ గౌడ్, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు కార్యకర్తలు వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

# జగనన్న మహిళా పక్షపాతి..నియోజకవర్గం ఇన్చార్జి డాక్టర్ సుధీర్ ధారా

**మహిళలకు వైయస్సార్ ఆసరా మెగా చెక్కు అందజేత.**

**7675 లబ్ధిదారులకు రూ.4,కోట్ల 93,లక్షల మెగా చెక్కు పంపిణీ**

**వైయస్సార్ ఆసరా కార్యక్రమంలో నియోజవర్గం ఇన్చార్జి డాక్టర్ సుధీర్ ధారా**



**పాములపాడు మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి మహిళల పక్షపాతి అని అన్నారు. నందికొట్కూరు నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ సుధీర్ ధారా అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం నాడు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నాలుగో విడత వైయస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సుధీర్ ధార హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంక్షేమ పథకంలో మహిళలకు పెద్దపీట వేశారని ఇండ్ల పట్టాల దగ్గర నుంచి అన్ని మహిళలకు అన్ని సంక్షేమ పథకాలు మహిళలకు అందిస్తున్నారని రాబోయే ఎన్నికల్లో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్ళీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలని కోరారు ప్రతిపక్ష పార్టీకి అభ్యర్థులను ఇంతవరకు ఖరారు చేయలేదని వారికి ఓటమి భయం ఉంది కాబట్టే జనసేన బిజెపి పార్టీలను కలుపుకున్నారని పోటీకి సిద్ధమవుతున్నారని వైయస్ జగన్మోహన్ రెడ్డి మాత్రం ఒక్కడే అని కొని ఆడారు మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మహిళలకు మెగా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సరస్వతి, ఏపిఎం అనురాధ, వైసిపి మండల అధ్యక్షుడు రామలింగేశ్వర్ రెడ్డి, సర్పంచులు తుమ్మలూరు వరప్రసాద్, మిట్ట కందల చింతల నారాయణ, రుద్రవరం రామస్వామి, ఇస్కాల మౌలాలి, చెలిమిళ్ళ కోట్ల చంద్ర రెడ్డి, మద్దూరు సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, వేంపెంట సొసైటీ చైర్మన్ మచ్చ పెద్ద వెంకటస్వామి,నాయకుల విజయసింహా రెడ్డి వైయస్సార్సీపి జెసిఎస్ మండల ఇన్చార్జి నాగరాజు, యువజన విభాగం మండల అధ్యక్షుడు బత్తిని చరణ్ కుమార్, వెంకటేశ్వర రెడ్డి, కమలాకర్, బాలేశ్వర్ రెడ్డి, వెలుగు సిబ్బంది పొదుపు మహిళలు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధికి రూ.50 వేలు విరాళం



విరాళం అందజేస్తున్న రవికుమార్ దంపతులు

**నంద్యాల అర్బన్, మేజర్న్యూస్ :** నంద్యాల జిల్లా పాణ్యం మండలంలోని ఎస్. కొత్తూరు గ్రామంలో వెలిసిన శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి మంగళవారం భక్తులు రూ.50,116లు విరాళం అందజేసినట్లు ఈఓ రామకృష్ణ తెలిపారు. నంద్యాల పట్టణం రవి డిగ్రీ కళాశాల యాజమాన్యం రవికుమార్, శ్రీదేవి దంపతులు అమెరికా డెన్మార్క్‌లో ఉంటున్న కూతురు పాలూరి సాయిశ్రీ విరజ, అల్లుడు పాలూరి వెంకటధీరజ్‌ల పేరు మీద విరాళాన్ని అందజేశారు. దాతలను సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రధాన అర్చకులు కంపమల్ల సత్యనారాయణ స్వామి, సురేష్ శర్మ, పాల్గొన్నారు.

## సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల

# నివేదికలు అందించండి- కలెక్టర్



కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు

**నంద్యాల కల్చరల్, మేజర్న్యూస్ :** రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల మ్యాపింగ్ నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం వర్చువల్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రాబోయే ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల రిపోర్టులు సమర్పించాలని రిటర్నింగ్ అధికారులు, పోలీసు అధికారులను ఆదేశించారు ఎన్నికల సంఘం సూచించిన మార్గదర్శకాలను పరిగణలోకి తీసుకుని మ్యాపింగ్ నివేదికలు సిద్ధం చేసి పంపాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అన్ని రకాల బృందాలకు ఈ నెలాఖరులోగా అన్ని శిక్షణలు పూర్తి చేయాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల ఫారంలను వెంటనే పూర్తి చేసి అర్హులైన వారిని ఓటర్ల జాబితాలో నమోదు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే వీడియో రికార్డింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్, తదితర బృందాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆయా బృందాలు నిర్వహించాల్సిన విధులపై సమగ్ర అవగాహన కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

# జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన నారాయణ విద్యార్థులు


షాహిద్‌అలీఖాన్


వేదవ్యాస్


సాకేత్‌సాయి మణికంఠ


సాకేత్‌రామ్


సాయిఅభినయ్


తనూజ్‌సాయి

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** దేశ వ్యాప్తంగా విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫేస్-1 ఫలితాల్లో కర్నూలు నారాయణకు చెందిన విద్యార్థులు సత్తా చాటి విజయ ఢంకా మోగించారని విద్యా సంస్థల డీజీఎం గోవర్ధన్‌రెడ్డి, డీన్‌లు ఆంజనేయరెడ్డి, విశ్వ నాథరెడ్డి, నరసింహా రావులు తెలిపారు. షాహిద్ అలీఖాన్(99.93), వేదవ్యాస్ (99.92), సాకేత్ సాయిమణికంఠ(99.71), ఎస్.సాకేత్ రామ్ (99.62), సాయి అభినయ్ (99.40), తనూజ్ సాయి(99.16), నిఖిల్‌రెడ్డి (98..88), ధారాలాస్య (98.40) టి.ప్రణీత (98.35), సౌమ్యశ్రీ (98.30), హారిక (98.24)లు సాధించినట్లు తెలిపారు.

# జేఈఈ మెయిన్ 2024 ఫలితాలలో ఎస్ డి ఆర్ ఆకాంక్ష విద్యార్థుల హవా..

**- తిరుగులేని ఫలితాలతో విజయభేరీ మోగించిన ఎస్ డి ఆర్ ఆకాంక్ష కళాశాల..**
**- 99.95 పర్సెంటైల్ తో రాయలసీమలోనే మొదటి ర్యాంకును కైవసం చేసుకున్న ఎస్ డి ఆర్ ఆకాంక్ష విద్యార్థి మోహన కృష్ణ**



**నంద్యాల టౌన్, మేజర్‌న్యూస్:** మంగళవారం విడుదలఅయిన జేఈఈ మెయిన్ 2024ఫలితాలలో ఎస్‌డిఆర్ ఆకాంక్ష జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుతమైన విజయాన్ని అందుకున్నారు. మోహన కృష్ణ 99.95 పర్సెంటైల్‌తో రాయలసీమలోనే మొదటి ర్యాంకును కైవసం చేసుకొని చరిత్ర సృష్టించాడు.కె.జితేంద్ర 99.36 పర్సెంటైల్‌తో, నాగ పవన్ కుమార్ 97.63 పర్సెంటైల్ తో మరియు వి.కార్తికేయ రెడ్డి96.78 పర్సెంటైల్ తో మరియు 90 పర్సెంటైల్ తో 18 మంది అద్భుతమైన ఫలితాలను సాదించారు.ఈ సందర్భంగా కళాశాల లో ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన సభ కు ముఖ్య అతిథులుగా నంద్యాల డిఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డి, డాక్టర్ గెలివి సహదేవుడు, సి ఐ మంజునాథ్ రెడ్డి మరియు ఎస్ వి ఆర్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ శనివారపు వెంకట రామిరెడ్డి హాజరై అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఇందుకు గాను కృషి చేసిన అధ్యాపకులను కళాశాల చైర్మెన్ యస్. కొండా రెడ్డి అభినందించారు. అనంతరం చైర్మెన్ కొండారెడ్డి మాట్లాడుతూ పోటీ పరీక్ష ఏదైనా ఫలితాలలో ఎస్ డి ఆర్ ఆకాంక్ష విద్యార్థులు అగ్రగామి గా నిలుస్తున్నారని తెలిపారు.ఈ సందర్భముగా అత్యధిక ర్యాంకులు సాధించిన విద్యార్థులు మాట్లాడుతూ తమకు ఈ ఫలితాలు రావడానికి కృషి చేసిన, బోధించిన అధ్యాపక మరియు అధ్యాపకేతర బృందం నకు కృతజ్ఞతలు తెలిపారు.ముఖ్య అతిథులు మాట్లాడుతూ డిఎస్పీ రవీంద్రనాథ్ రెడ్డి, డాక్టర్ గెలివి సహదేవుడు, సి ఐ మంజునాథ్ రెడ్డి మరియు ఎస్ వి ఆర్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ శనివారపు వెంకట రామిరెడ్డి లు మాట్లాడుతూ సాధారణ విద్యార్థులతో అద్భుత ర్యాంకులు ఎస్ డి ఆర్ ఆకాంక్ష విద్యార్థులు సాధిస్తున్నారని,ఇలాగే భవిష్యత్తు లో ఇంకా బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

# దళితులే తెలుగుదేశాన్ని గెలిపిస్తారు : టీజీ భరత్

**కర్నూలు, మేజర్‌న్యూస్‌ప్రతినిధి :** రాష్ట్రంలోని దళితులందరూ తెలుగు దేశం పార్టీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని కర్నూలు నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. బుధవారం నగరంలోని పాతబస్టాండులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలేసి దళిత జేఏసీ చైర్మన్ బొల్లెద్దుల రామక్రిష్ణ ఆధ్వర్యంలో చేపట్టిన దళిత చైతన్యం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమి శెట్టి వెంకటేశ్వర్లు, జనసేన ఇన్‌చార్జి అర్షద్ పాల్గొన్నారు. అనంతరం వీధుల్లో తిరుగుతూ ప్రజల ను కలిసి దళిత చైతన్యం కార్యక్రమం గురించి వివరించారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగం అమలులో లేదన్నారు. నిజమైన అంబేద్కర్ రాజ్యాంగం అమలు కావాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దళిత ద్రోహి జగన్ అన్నారు. దళిత జేఏసీ సభ్యులు దేవా, గున్నామార్క్, సుంకన్న, పామన్న, తిమ్మోజీ, శ్రీనివాసులు, పోతురాజు రవి, నాగన్న, శ్రీనివాసులు, ఆర్యశంకర్, మాధవ స్వామి, చిన్నమ్మి, శారదమ్మ, ఏసన్న, పెంచలయ్య, రాజ్‌కుమార్ మోహన్, ఈశ్వర్, ప్రసాద్‌రావు, మధుబాబు, ఆనందరావు, లక్ష్మినారాయణ, మల్లికార్జునబాబు, భాను, మణిప్రకాష్, జూటు రు రవి, జనసేన నాయకులు, టీడీపీ అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలేస్తున్న టీజీ భరత్

# రైతుల కష్టాలు ముఖ్యమంత్రికి కనిపించవా

**ప్రకటనలకే పరిమితమవుతున్న ప్రజా ప్రభుత్వం**



**దేవనకొండ ,మేజర్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి రాష్ట్రంలోని రైతుల కష్టాలు కనిపించవా అని అఖిలపక్షం పార్టీ నాయకులు టిడిపి మండల కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్,సిపియం జిల్లా నాయకులు వీర శేఖర్,సిపిఐ మండల కార్యదర్శి నర్సారావ్ అధికారులను నిలదీశారు.మంగళవారం స్థానిక యంపిడిఓ కార్యాలయం నందు యంపిడిఓ ఇద్రూస్ భాష ఆధ్వర్యంలో యంపిపి లక్ష్మిదేవమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా అఖిల పక్షం పార్టీల ఆధ్వర్యంలో రైతులతో కలిసి సమావేశ ప్రాంగణంలోకి చేరుకొని రైతుల ఎదుర్కొంటున్న సమస్యలపై నిరసన వ్యక్తం చేస్తూ అధికారులను,నాయకులను నిలదీశారు.ముఖ్యంగా రైతులకు సంబంధించిన ప్రభుత్వం మాది ప్రజా ప్రభుత్వం అంటూ ప్రకటించిన పంట నష్టపరిహారం,ఇన్సూరెన్స్‌తో పాటు హంద్రీ నివా ద్వారా నీటిని పంపిణీ చేస్తామని పత్రికా ప్రకటనలకే పరిమితం అయ్యాయని కాబట్టి ప్రభుత్వం ప్రకటించిన హామీలను తక్షణమే అమలు చేసేలా అధికారులు నివేదికలను పంపాలని డిమాండ్ చేశారు.దేవనకొండ వైకాపా యంపిటిసి సభ్యులు తపాలా శ్రీనివాసులు మాట్లాడుతూ దేవనకొండ సమీపంలో కూరగాయల మార్కెట్‌ను ఎలాంటి అనుమతులు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.వ్యవ సాయాధికారి సురేశ్ బాబు,హౌసింగ్ డిఇ ఆదినారాయణ రెడ్డి,ఇఒపిఆర్డీ సూర్యనారాయణ, యంఇఒ, ఆర్ అండ్‌బి ఎఇ శ్వేత,ఎపియం రమేష్,ఎపిఓ కృష్ణమూర్తి అధికారులు పాల్గొన్నారు.

ఆలయాల్లో గుండంశేషిరెడ్డి

# ప్రత్యేక పూజలు

**బనగానపల్లెరూరల్‌మేజర్,న్యూస్ః** వైఎస్ ఆర్‌సిపి రాష్ట్ర కార్యదర్శి గుండం శేషిరెడ్డి మంగళవారంనాడు హెచ్. కొత్తూరు శ్రీవల్లీ సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయం మరియు నందవరం గ్రామంలో వెలిసిన శ్రీ చౌడేశ్వరీ దేవి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజ లను నిర్వహించారు. వారు ఆలయానికి చేరుకోగానే ఆలయ అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నారాయణాచారి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.


అర్చకులు ప్రసాదం అందజేస్తున్న దృశ్యం

# ఏవిని మర్యాదపూర్వకంగా కలిసిన భూమా కిషోర్ రెడ్డి

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** రాష్ట్ర విత్తనాబివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, టిడిపి నాయకులు ఏవి సుబ్బారెడ్డిని ఆళ్లగడ్డలోతాలూకా బిజెపి బాధ్యులు భూమా కిషోర్ రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాబోయే ఎన్నికల్లో తాను ఆళ్లగడ్డ అసెంబ్లీ నుండి పోటీకి సిద్ధంగా ఉన్నానని మీ మద్దతు ఇవ్వాలని భూమా కిషోర్ రెడ్డి ఏవి సుబ్బారెడ్డిని కోరడం జరిగింది.స్పందించిన ఏవిసుబ్బారెడ్డి మాట్లాడుతూ బిజెపితో పొత్తుపై చర్చలు జరుగుతున్నాయని, టిడిపి, జనసేన, బిజెపి పొత్తులో భాగంగా బిజెపికి ఆళ్లగడ్డ సీటు కేటాయిస్తే నా మద్దతు భూమా కిషోర్ రెడ్డికి ఉంటుందని ఏవి సుబ్బారెడ్డి తెలిపారు. వ్యక్తిగతంగా నా అభిప్రాయం చెప్పేది కాదని అధిష్టానం పై ఆధారపడి ఉంటుందని పొత్తులు ఉండి బిజెపికి కేటాయిస్తే తన మద్దతు భూమ కిషోర్ రెడ్డికి ఉంటుందని ఏవి సుబ్బారెడ్డి స్పష్టం చేశారు.


ఏవి సుబ్బారెడ్డిని కలిసిన భూమా కిషోర్ రెడ్డి

# చిరంజీవిని కలిసిన మెగా అభిమాని


చిరంజీవితో అభిమాని రాహుల్

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** భారతదేశంలోనే రెండవ అతిపెద్ద పురస్కారమైన పద్మ విభూషణ్ పురస్కారం వచ్చిన శుభ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవిని ఎమ్మిగనూరు మెగా ఫ్యాన్స్ తాలూకా అధ్యక్షుడు రాహుల్ సాగర్ కలిసి శుభాకాంక్షలు తెలియజేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ ఇటీవలే హైదరాబాదులో ఏర్పాటు చేసిన మెగా ఫ్యాన్స్ సమావేశంలో చిరంజీవిని కలవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందని, రక్తదానం, నేత్రదానం వైపునడిపిస్తూ ఎంతోమందికి స్ఫూర్తిగా నిలిచిన మెగాస్టార్ చిరంజీవిని కేంద్ర ప్రభుత్వం రాబోయే రోజుల్లో భారతరత్న పురస్కారంతో సత్కరిస్తుందని ఆశాభవాన్ని వ్యక్తం చేశారు.

# 21వ వార్డులో రోడ్లు వేయాలని నిరసన..

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** పట్టణంలోని 21వ వార్డులో సీసీ రోడ్లు వేయాలని కోరుతూఆ వార్డు టీడీపీకౌన్సిలర్ దయసాగర్, వార్డు అధ్యక్షులు హుస్సేన్ పీరాల ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 21వ వార్డులో గత మూడు సంవత్సరాలుగా గీతా మందిరంవెనకాలఉన్న రోడ్లు సెక్షన్స్ వర్క్ చేసి వదిలేసిన రోడ్ల వల్ల వార్డు ప్రజలు చాలా ఇబ్బందులు గురవుతున్నారు తెలిపారు. గతంలో ఈ విషయాన్ని మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు తెలిపిన చర్యలు తీసుకోకపోవడం లేదనిపేర్కొన్నారు.మా వార్డు ప్రజలు మున్సిపాలిటీకి పన్నులు కడుతున్నా కూడా రోడ్లు ఎందుకు వేయడం లేదని అధికారులకు ప్రశ్నించారు. ప్రతిపక్ష కౌన్సిలర్ వార్డు కావడంతో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని వారు తెలిపారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వెంటనే ఈ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో ఎల్లప్ప, గడ్డం రవి,రామ్, రంగమ్మ,సత్యమ్మ, ఉమాదేవి, రేష్మ పాల్గొన్నారు.


రోడ్డుపై బైఠాయించిన టీడీపీ కౌన్సిలర్, తదితరులు

# జేఈఈ ఫలితాలలో రావూస్ విద్యార్థుల ప్రతిభ


విజయం సాధించిన విద్యార్థినీ, విద్యార్థులతో చైర్మన్ , డైరెక్టర్

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని రావూస్ విద్యాసంస్థల విద్యార్థులు ఎన్‌టీఏ ప్రకటించిన జేఈఈ మెయిన్స్ ఫేస్-1 ఫలితాలలో తమ కళాశాల విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించినట్లు చైర్మన్ ఏఎంవి అప్పారావు, డైరెక్టర్ మోనిచంద్ర తెలిపారు. కార్తీకేయ శర్మ, విష్ణుప్రియ, సౌజన్య, పద్మావతి, శ్రీరంగభరత్, శ్రావ్య, సమీరా, చిన్న మౌలాలి, సత్యమహేశ్వరి, నందకిషోర్‌లు ఫలితాలతో రావూస్ విజయ పరంపర కొనసాగించారని తెలిపారు. డైరెక్టర్ చంద్ర మాట్లాడుతూ ఫేస్-2 ఫలితాలలో ఇంతకన్నా మెరుగైన ఫలితాలలో మీ ముందుంటామని తెలిపారు. గత విద్యాసంవత్సరం నుంచి మంచి మెటీరియల్ ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఇంతటి ఫలితాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులను తల్లిదండ్రులను అధ్యాపకబృందాన్నికళాశాల చైర్మన్ అప్పారావు అభినందించారు.

## జాతీయ రహదారి భద్రత మహోత్సవాలు

**బనగానపల్లెమేజర్,న్యూస్ః** జాతీయ రహదారి భద్రత మహోత్సవాలను యనకండ్ల మైహోమ్ సిమెంట్ ఫ్యాక్టరీ నందు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నంద్యాల జిల్లా రవాణా అధికారి శివారెడ్డి, మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ తిమ్మరుసు నాయుడు , అసిస్టెంట్ ఎం.వి.ఐ సుబ్బయ్య, బనగానపల్లె ఎస్.ఐ రామిరెడ్డి, ఫ్యాక్టరీల డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి వారికి తగిన సలహాలను, సూచనలను అందజేశారు.


అవగాహన కల్పిస్తున్న నంద్యాల జిల్లా రవాణా అధికారి శివారెడ్డి

# గ్రామాల్లోనే ప్రజలకు అన్ని రకాల సేవలు

## - ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్:** వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గ్రామాల్లోనే ప్రజలకు అన్ని రకాల సేవలు అందేలా పారదర్శకంగా పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని లొద్దిపల్లె గ్రామంలో గ్రామ సర్పంచ్ పుష్పమ్మ ఎంపీటీసీ నాగశిరీష ఆధ్వర్యంలో నూతన సచివాలయ రైతు భరోసా విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్ల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా కర్నూలు వ్యవసాయం మార్కెట్‌యార్డు ప్రభాకర్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండల చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సచివాలయ, వాలంటరీ వ్యవస్థ సేవలందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నటరాజు, ఎంపీడీవో మల్లేశ్వరి, వ్యవసాయ అధికారి సుధాకర్, పంచాయతీరాజ్ ఏఈ రామసుబ్బారెడ్డి, జడ్పీ రంగనాథ్‌గౌడ్, ఎంపీపీ తిప్పన్న, జేసీఎస్ మండల కన్వీనర్ లోకిరీబాష, పంచాయతీ సెక్రటరీ మద్దిలేటి, వీఆర్వో బాలమద్దిలేటి, వైసీపీ నాయకులు భైరాపురం సర్పంచ్ గంగాధర్‌రెడ్డి, ఉప సర్పంచ్ కిరణ్‌కుమార్, మాజీ సింగిల్ విండో చైర్మన్ భద్రారెడ్డి, మాజీ సర్పంచ్ రాజేశ్వరరెడ్డి, ప్రభాకర్, నాగేందర్‌రెడ్డి, గజ్జల వెంకటస్వామి, గజ్జల వెంకటేశ్వర్లు, హనుమన్న, వెంకటరాముడు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.


స్వాగతం పలుకుతున్న దృశ్యం


సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ సెంటర్ ప్రారంభిస్తున్న కాటసాని

### బుగ్గానపల్లె తాండాలో

# వైభవంగా మారెమ్మ దేవర మహోత్సవం

**బేతంచెర్ల మేజర్‌న్యూస్ :** బేతంచెర్ల మండల పరిధిలోని బుగ్గానపల్లె తండాలో మంగళవారం తాండ వాసుల గ్రామ దేవతలైన సేవాలాల్ మహరాజ్, మారెమ్మ దేవరా మహో త్సవంను గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. తాండవాసుల సాంస్కృతిక సంప్రదాయాలకు అను గుణంగా ఉదయం మహిళలు గ్రామదేవతలైన సేవాలాల్ మహరాజ్, మారెమ్మ దేవతలకు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. ఈ మహోత్సవం నకు రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ పాల్గొని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా డోన్ టిడిపి యువ నాయకులు ధర్మవరం మన్నే గౌతమ్ రెడ్డి పాల్గొని గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



# దేవరలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

**కల్లూరు, మేజర్‌న్యూస్:** కల్లూరు మండల పరిధిలోని ఉలిందకొండ గ్రామంలో జరుగుతున్న దేవర కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైసీపీ నాయకులు కెవి.రమణారెడ్డి ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే హాజరై మంగళవారం అమ్మవారికి పూజలు చేశారు. ఆయన వెంట వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

# సమ్మతగేరిలో సుంకలమ్మ అవ్వ దేవాలయం ప్రారంభం

**హొళగుంద, మేజర్‌న్యూస్ :** హొళగుంద మండలం సమ్మతగేరి గ్రామంలో గ్రామ పెద్దలు, గ్రామస్తుల సహకారంతో కలిసికట్టుగా నిర్మించిన నూతన సుంకలమ్మ అవ్వ దేవాలయం ప్రారంభోత్సవ కార్యాక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. సుంకలమ్మ దేవి, శివాలయం లో ఏర్పాటు చేసిన నవగ్రహాల విగ్రహాల ప్రాణ ప్రతిష్ట కార్యాక్రమం హాలహర్వి మండలం జంగమర హోసళ్లి మఠం ఆజాత శంభులింగ శివచార్యులు చేశారు. కార్యాక్రమంలో జలాభిషేకం, ధాన్యాభిషేకం, హోమాలు, తదితర పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి దేవతా మూర్తులకు నైవేద్యాలను సమర్పించి దర్శించుకున్నారు. గ్రామంలో పండుగా వాతవరణం నెలకొంది.దేవాలయంలో భక్తుల సందడి నెలకొంది.. కార్యాక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.


నూతన సుంకలమ్మ అవ్వ దేవాలయం


సుంకలమ్మ దేవి విగ్రహం

# నిరుపేద కుటుంబాలకు చేయూత

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్:** మండలంలోని లొద్దిపల్లె గ్రామానికి చెందిన వై.తిరుపంరెడ్డి మూడో వర్ధంతి సందర్భంగా ఆయన సతీమణి లక్ష్మీకాంతమ్మ, కుమారుడు వై.నాగేంద్రరెడ్డి, మనుముడు వై.గజేంద్రనాథ్‌రెడ్డి సహకారాలతో గ్రామంలోని నిరుపేద కుటుంబాలకు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం రూ.10వేల ఫిక్సడ్ డిపాజిట్ బాండ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయంగా తిరుపంరెడ్డి సర్పంచ్‌గా, సొసైటీ చైర్మన్‌గా గ్రామంతోపాటు మండలానికి తన సేవలు అందించాడన్నారు. ఆయన భౌతికంగా లేకపోయినా వారి కుటుంబ సభ్యులు ఆయన ఆశయాలను బతికిస్తున్నారన్నారు.


ఫిక్స్డ్ డిపాజిట్ బాండ్లను అందజేస్తున్న ఎమ్మెల్యే

# టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం

## - మాజీ ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి

**కల్లూరు, మేజర్‌న్యూస్:** టీడీపీలో అధికారంలోకి వస్తేనే అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందని పాణ్యం మాజీ ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. కల్లూరు అర్బన్ 31వవార్డు షరీన్‌నగర్‌కు చెందిన మహిళలు, యువకులు టీడీపీ కల్లూరు అర్బన్ కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం గౌరుచరితారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి ఆమె పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గౌరుచరితారెడ్డి మాట్లాడుతూ టీడీపీ హయాంలోనే మహిళలకు, యువకులకు అన్ని సంక్షేమ పథకాలు అమలయ్యాయని తెలిపారు. రేణుక, గంగా, బాలమ్మ, లక్ష్మీదేవి, హరిత, భాగ్యమ్మ, కళావతి, లక్ష్మి హరిత, పుష్పవతి, సునీత, గోపి, వెంకటేష్, సాయి, చందు, షేక్షా, ఆకాష్, దినేష్, సతీష్, అయ్యస్వామి పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదరిశ ప్రభాకర్‌యాదవ్, వీరేంద్రకుమార్, జగదీష్‌రెడ్డి పాల్గొన్నారు.


పార్టీలో చేరుతున్న మహిళలు

# బిసిలపై జగన్‌రెడ్డిది కపట ప్రేమ

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** వైకాపాలో జగన్మోహన్‌రెడ్డి ఒంటెద్దు పోకడతో బిసి నాయకులు బయటికి వస్తున్నారని రాష్ట్ర బిసి సాధికార కన్వీనర్ వై. నాగేశ్వర్ యాదవ్, టీడీపీ బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గోవింద నాయుడులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ బిసి సెల్ ప్రెసిడెంట్ కృష్ణమూర్తి వైసీపీలో ఉండలేక బయటికి వచ్చారని అన్నారు. ఆ పార్టీ నేతలు జగన్మోహన్‌రెడ్డి బిసి ద్రోహి అంటున్నారని అన్నారు. కృష్ణమూర్తి బయటికి రావడంతో జగన్ నిజస్వరూపం బయటపడిందన్నారు. జగన్ బిసి, బడుగు బలహీన వర్గాలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని అన్నారు. బిసిలకు తాత్కాలిక పదవులు ఇచ్చి పవర్‌ను మాత్రం ఆ నలుగురు రెడ్ల చేతుల్లో పెట్టారని ఆరోపించారు. ఎంతో మంది బిసి నాయకులు వైకాపాకు దూరమవుతున్నారని అన్నారు. రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతం ఉన్న బిసిలకు వైకాపాలో సముచిత స్థానం లేదని అన్నారు. నా ఎస్టీ, నా ఎస్సీ, నా బిసిలు అని జగన్‌రెడ్డి కపట ప్రేమ చూపిస్తున్నారని అన్నారు. నేతి బీరకాయలో నెయ్యి ఎంత నిజమో వైసీపీలో సామాజిక న్యాయం అంతే నిజం అని విమర్శించారు. రాష్ట్రంలో 56 కులాలకు కార్పొరేషన్‌లు ఏర్పాటు చేశారు కానీ నిధులు లేవని అన్నారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌కు ప్రజలే బుద్ది చెప్తారని అన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వర్ యాదవ్

# 16న సామూహిక సూర్య నమస్కారాలు

**కర్నూలు టౌన్, మేజర్‌న్యూస్:** రథసప్తమి సందర్భంగా ఈ నెల 16న ఉదయం 8.00గంటలకు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కర్నూలు శివారులోని క్రెడో పాఠశాలలో ఆదిత్య హృదయ పారాయణం, సామూహిక సూర్య నమస్కారాలు నిర్వహిస్తున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, క్రెడో పాఠశాల కరస్పాండెంట్ శ్రావ్యకార్తీక్, లలితా పీఠం పీఠాధిపతులు గురు మేడా సుబ్రహ్మణ్యంస్వామి, ధర్మ ప్రచార మండలి సభ్యులు అనంతఅనిల్‌కుమార్ తెలిపారు. మంగళవారం క్రెడో పాఠశాలలో ఆదిత్య హృదయ పారాయణం పుస్తకం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


పుస్తకం ఆవిష్కరిస్తున్న దృశ్యం

# డాక్టర్ రహిమాన్‌కు నియామక పత్రం అందజేత

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిలరెడ్డి, జిల్లా అధ్యక్షులు లక్ష్మీ నరసింహయాదవ్ ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ డాక్టర్స్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ డాక్టర్స్ సెల్ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా రహిమాన్‌ను నియమించినట్లు ఈమేరకు ఆయనకు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతలమోహన్‌రావు నియామక పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ రహిమాన్ సేవలు గుర్తించి వారికి ఈ సముచిత స్థానాన్ని కల్పించడం జరిగిందన్నారు. ఎంతోమంది పేదవారికి ఉచిత వైద్యం అందిస్తూ తక్కువ ఖర్చుతో సేవలు చేస్తూ ఉన్నందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలరెడ్డిపై వైసీపీ మంత్రులు అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు తెలిపారు. డాక్టర్ రహిమాన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నన్ను గుర్తించి ఈ బాధ్యతలు అప్పచెప్పడం పట్ల కాంగ్రెస్ పార్టీ పెద్దలకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో యువ నాయకులు గోళ్ళ రాజేష్, కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి మస్తాన్‌ఖాన్, రవిబాబు, అబ్రహం, తదితరులు పాల్గొన్నారు.


రహిమాన్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న చింతల మోహన్‌రావు

## లద్దగిరిలో శ్రీ మారెమ్మ విగ్రహ ప్రతిష్టాపన

### విగ్రహ ప్రదాత తెదేపా జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డికి ఘన స్వాగతం



**కోడుమూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని లద్దగిరి గ్రామంలో మంగళవారం శ్రీ మారెమ్మ విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరుపుకున్నారు. శ్రీ మారెమ్మ తల్లి విగ్రహ ప్రదాత అయిన తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డికి గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. కోట్ల సూర్య ప్రకాశ్ రెడ్డి స్వగృహం నుండి ఆలయం వరకు గ్రామ పెద్దలు ఘనంగా స్వాగతం పలికారు . అనంతరం కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి శ్రీ మారెమ్మ విగ్రహానికి పూజలు నిర్వహించారు. గ్రామంలో జరిగే విగ్రహ ప్రతిష్ట కోసం బంధువులు అత్యధికంగా తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో శ్రీ మారెమ్మకు పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో డీలర్ ప్రకాష్ రెడ్డి, సీతారామరెడ్డి, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

## శ్రీశైలం బిజెపి కన్వీనర్‌ను ప్రకటిస్తాం : పురంధేశ్వరి



**బండిఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** భారతీయ జనతా పార్టీ శ్రీశైలం నియోజకవర్గం కన్వీనర్ ను త్వరలో ప్రకటిస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి తెలిపారు. మంగళవారం విజయవాడలోని బిజెపి పార్టీ కార్యాలయంలో నంద్యాల జిల్లా కార్యదర్శి చింత నాగేశ్వరరావు ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో నంద్యాల జిల్లా బిజెపి అధ్యక్షురాలు బైరెడ్డి శబరి తో మాట్లాడి శ్రీశైలం నియోజకవర్గం కన్వీనర్ ప్రకటించడం జరుగుతుందన్నారు. గ్రామస్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు బిజెపి పార్టీ ని బలోపేతం చేయడానికి తనతో పాటు ప్రతి కార్యకర్త కృషి చేయడం జరుగుతుందన్నారు.

## సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో



**బండిఆత్మకూర్, మేజర్‌న్యూస్ :**మండలంలోని పెద్దదేవలాపురం గ్రామంలో మంగళవారం బండి ఆత్మకూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారి విజయరావు గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో విజయ రావు మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది సమయపాలన పాటిస్తూ, రికార్డులను తప్పనిసరిగా నిర్వహణ చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం ద్వారా పేదలకు అందజేసిన ఇలా పట్టాల రిజిస్ట్రేషన్ గురించి ఆరా తీశారు. గ్రామంలో పీఎంజేవై కార్డుల పంపిణీ, ఆరోగ్యశ్రీ యాప్ తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. సచివాలయం దగ్గరికి వచ్చే గ్రామ ప్రజలతో సిబ్బంది అవినాభావ సంబంధంతో వారి యొక్క సమస్యలను తెలుసుకొని పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన తెలియజేశారు కార్యక్రమంలో విస్తరణాధికారి శ్రీనివాసులు, గ్రామ సెక్రెటరీ రామచంద్రుడు ఇంజనీరింగ్ అసిస్టెంట్ బాబా ఫక్రుద్దీన్, వెల్ఫేర్ అసిస్టెంట్ సానీ నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర్లు సేవా సమితి ఆధ్వర్యంలో నీటి సరఫరా

**ఆస్పరి, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని పుప్పాలదొడ్డి గ్రామంలో తాగునీరు సరఫరా ట్యాంకర్ ద్వారా ఏర్పాటు చేశారని బండమీద వెంకటేశ్వర్లు సేవా సమితి మండల నాయకులు సురేంద్ర, విరుపాక్షి, నాగేంద్రయ్యలు పేర్కొన్నారు. మంగళవారం వారు మాట్లాడుతూ, గిడ్డయ్య తాత ఉరుసు సందర్భంగా ప్రజలు ఏదుర్కొంటున్న సమస్యను తాత్కాలికంగా పరిష్కారం కోసం బండమీద వెంకటేశ్వర్లు సేవా సమితి ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా చేయడం జరిగిందన్నారు. ఈ సేవా సమితి ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు చేయాలని, వేసవిని దృష్టిలో ఉంచుకొని ఉన్నతాధికారులు గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి నాయకులు రంగన్న, రమేష్, రంగప్ప, బాలు, ఎర్రిస్వామి, బోజరాజు, వన్నప్ప, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన బుట్టా రేణుకా..!


ఆసుపత్రిలో రోగులను పరామర్శి స్తున్న బుట్టా రేణుకా

**ఎమ్మిగనూరు, మేజర్‌న్యూస్:** వైద్య విధాన్ పరిషత్ ఆసుపత్రిని మంగళ వారం సాయంత్రం వైసీపీ అభ్యర్థి బుట్టా రేణుకా పరిశీలించారు. రోగు లను పరామర్శించి వైద్య సేవలపై అడిగి తెలుసుకున్నారు. అలాగే వైద్యు లతో సమావేశమై ఆసుపత్రిలోని సౌకర్యాలపై ఆరా తీస్తూ అవసరమైన పరికరాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆసుపత్రి కొద్దిగా ఇరుకుగా ఉన్నా అవసరమైన పరికరాలు అందుబాటులో ఉన్నాయని, వైద్యుల పనితీరు కూడా మెరుగ్గా ఉందని అభినందించారు. 100 పడకల ఆసుపత్రి నిర్మాణం చివరి దశలో ఉందని, అది పూర్తి అయితే ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల్లోని రోగులకు అత్యుత్తమ వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. ఇంకా ఆసుపత్రికి అవసరమైన పరికరాలపై వైద్యుల నివేదిక ఆధారంగా ప్రభుత్వానికి సిఫార్స్ చేస్తానని ఆమె వెల్లడించారు. ఆమె వెంట భర్త బుట్టా నీలకంఠప్ప, వైసీపీ పట్టణ అధ్యక్షుడు బుట్టా రంగయ్య, వైద్యులు డాక్టర్ మైత్రి, బాలాజీ కుమార్, స్థానిక కౌన్సిలర్ పూజేశ్వరి, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్ర అభివృద్ధి వైయస్ జగన్‌తోనే సాధ్యం

### విభేదాలకు తావు లేకుండా పనిచేస్తాం

### సిద్ధం కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



**కోడుమూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర అభివృద్ధి సియం వైయస్ జగన్మోహన్ రెడ్డి తోనే సాధ్యమని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆదిమూలపు సతీష్ కూడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డిలు అన్నారు. మంగళవారం నియోజకవర్గంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజలు నిర్వహించారు. కోడుమూరుకు చేరుకున్న వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఆదిమూలపు సతీష్ కూడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డిలకు గూడూరు ఎంపీపీ కుందం సునీత రెడ్డి, కుందం ప్రతాపరెడ్డిల ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. పట్టణంలోని కుందం వారి స్వగృహం నుండి గూడూరు రోడ్డు గల శ్రీ లక్ష్మమ్మ దేవాలయం వరకు పూలాభిషేకంతో స్వాగతం పలికారు. శ్రీ లక్ష్మమ్మ దేవాలయం దగ్గర కోడుమూరు నుంచి గూడూరు వరకు గల బీటీరోడ్డు కు భూమి పూజ నిర్వహించారు. గూడూరు ఎంపీపీ కుందం సునీత రెడ్డి కోడుమూరు ఎంపీపీ రుతమ్మ లతో పండితుడు పూజలు జరిపించగా కూడా చైర్మన్ కోట్ల హర్ష గడ్డపారాతో మట్టి తీయగా, నియోజకవర్గ ఇన్చార్జి ఆది మూల్లపు సతీష్ శలిక చేతపట్టి చదును చేశారు. అనంతరం ఎల్ఎల్సీ కాలువ 4/R ఐడి దగ్గర రైతుల కోరిక మేరకు ప్రత్యేక తూము కోసం భూమి పూజలు చేశారు. తూము నిర్మించుకుంటే దాదాపుగా 400 ఎకరాల భూమికి సాగునీరు అందుతుందన్నారు. అదేవిధంగా వర్కూరు గ్రామంలోని ఎస్సీ కాలనీలో గల తాగునీటి సమస్య తీర్చడానికి భూమి పూజ చేశారు. గ్రామ పంచాయతీ బోర్డు నిధుల ద్వారా హంద్రీనది నుండి ఎస్సీ కాలనీకి పైపులైన్ నిర్మించుట కొరకు రూ 5 లక్షలతో పనిచేయుటకు తీర్మానం చేయడం జరిగిందన్నారు. అనంతరం కూడా చైర్మన్ కోట్ల ఇంచార్జ్ దిమూలపు సతీష్ లు మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సముద్రం లాంటిదని చిన్న చిన్న పొరపాట్లు జరుగుతున్నప్పటికీ వాటన్నిటిని పరిష్కరించుకొని వైసీపీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామన్నారు. వైయస్ జగన్ మోహన్ రెడ్డిని రెండవసారిగా సీఎం చేయడానికి కలిసివచ్చే కార్యకర్తలందరినీ కలుపుకొని విభేదాలకు తావు లేకుండా పార్టీ విజయానికి కృషి చేస్తామన్నారు. అదేవిధంగా ఈనెల 18న అనంతపురంలో జరిగే సిద్ధం కార్యక్రమానికి వేలాదిమందిగా తరలించడానికి భారీ ఎత్తున సన్నాహాలు చేస్తున్నామన్నారు. వైయస్సార్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి సిద్ధం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోడుమూరు జడ్పిటిసి రఘునాథ్ రెడ్డి, గూడూరు జడ్పిటిసి మౌలాలి, కర్నూలు జడ్పిటిసి ప్రసన్నకుమార్, వైస్ ఎంపీపీ విజయ్ కుమార్ రెడ్డి, చనుగొండ్ల సర్పంచ్ లక్ష్మీదేవి, వల్కూరు సర్పంచ్ లక్ష్మీదేవి,వల్కూరు ఎంపిటిసి మాదమ్మ,వైసీపీ మండల కన్వీనర్ రమేష్ నాయుడు సొసైటీ చైర్మన్ కృష్ణారెడ్డి, కృష్ణాపురం శ్రీనివాసులు, వర్కూరు ఈశ్వర్ రెడ్డి, జీతూరి ప్రసాద్, ప్రవీణ్, రవి కుమార్ రెడ్డి, కరెంటు మల్లారెడ్డి, అనుగొండ సూరి, లద్దగిరి కాజా, ఎంపిటిసి శిక్షావలి, ఉప సర్పంచ్ మాధులు తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి ప్రభుత్వంలోనే నియోజకవర్గ అభివృద్ధి

### మాజీ ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి

### హుస్సేనాపురంలో బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారెంటీ




**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** టిడిపి ప్రభుత్వంలోనే నియోజకవర్గం అభివృద్ధి చెందిందని గౌరీ చరిత రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హుసేనాపురం గ్రామంలో టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో బాబు షఉరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే గౌరీ చరిత రెడ్డి, టిడిపి నందికొట్కూరు ఇంచార్జి గౌరు వెంకట్ రెడ్డి హాజరయ్యారు . టిడిపి శ్రేణులు ఘన స్వాగతం ఫలికారు, ఊరేగింపుగా సంత గేటు దగ్గర ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి వెళ్లారు. గౌరి చరిత రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు అధికారంలోకి రావాలని జగన్మోహన్ రెడ్డి పాలనలో అభివృద్ధి శూన్యమని పేద ప్రజలపై దాడులు పెరిగాయని ఎమ్మెల్యే చంద్రబాబును అధికారంలో తీసుకొని వస్తే మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం సంవత్సరం కు మూడు ఉచిత సిలిండర్లు 18 సంవత్సరాల నిండిన ప్రతి మహిళకు 18,000 విద్యార్థులకు అమ్మబడి లాంటి సంక్షేమ పథకాలను అమలు చేసుకుందామని రాబోయే ఎన్నికల్లో వైయస్ పార్టీని జగన్మోహన్ రెడ్డిని ఇంటికి సాగనంపుదామని ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి గుట్టపాడు సర్పంచ్ మోహన్ రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి మహబూబ్బాషా పెద్ద బజారు, షాషావలి, కేవీ మధు,ఉప సర్పంచ్ ఎస్ సమీనా అల్లబాబు పాలకొల్లు సుధాకర్ రెడ్డి, కొంతలపాడు సుధాకర్ రెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎంపీపీ



**బేతంచెర్ల, మేజర్‌న్యూస్ :** మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని,ప్రతి కుటుంబంలోని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయిలో అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి,నగర పంచాయతీ చైర్మెన్ సి హెచ్ చలం రెడ్డి, రాష్ట్ర వేర్ హౌస్ డైరెక్టర్ బాబు రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ల డైరెక్టర్లు మూర్తి జావలి ఖాజా హుస్సేన్ అన్నారు . మంగళవారం పట్టణంలోని శిరిడి సాయి కళ్యాణ మండపంలో ఎంపీడీవో రవి ప్రసాద్, వైకెపి ఎపిఎం రామాంజనేయులు, మహిళా సమైక్య అధ్యక్షురాలు లక్ష్మీదేవిల ఆధ్వర్యంలో మండల పరిధిలోని 768 పొదుపు గ్రూపులకు నాలుగవ విడత క్రింద రూ. 4.88 కోట్ల చెక్కును పొదుపు మహిళలకు అందచేశారు. అనంతరం సి ఎం వై ఎస్.జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఉద్దేశ్యంతో వై ఎస్ ఆర్ ఆసరా,చేయూత, సున్నా వడ్డీ పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా నియోజకవర్గాన్ని మోడల్ నియోజకవర్గంగా అభివృద్ధి చేశారని సుమారు రూ. 2500 కోట్ల రూపాయలతో విద్యా, వైద్యరంగాల అభివృద్ధిలతోపాటు, నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి సీసీ రోడ్లు బీటీ రోడ్లు నిర్మించి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారని అన్నారు. నియోజకవర్గంలో త్రాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి గోరుకలు రిజర్వాయర్ నుండి సుమారు రూ. 351 కోట్ల రూపాయలతో వాటర్ గ్రిడ్ ఏర్పాటుచేసి ప్రతి ఇంటికి త్రాగునీటి వసతిని కల్పించే విధంగా కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి డైరెక్టర్ మురళి కృష్ణ,జెడ్పీటీసీ సభ్యులు శివలక్ష్మి,వై ఎస్ ఎంపీపీ రంగస్వామి, మండల కన్వీనర్ తిరుమలేశ్వర రెడ్డి,సురేంద్రనాథ్ రెడ్డి,ఎద్దులన్న, సర్పంచులు గుమ్మగాల రాజు శ్రీరాములు, వెంకటేశ్వర్లు చిన్న మద్దమ్మ, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సూర్య

బుధవారం 14 ఫిబ్రవరి 2024

# సీఎం పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలి

**– 700 మంది పోలీసులతో భారీ బందోబస్తు**



ఏర్పాట్లను పరిశీలిస్తున్న దృశ్యం

**కర్నూలు క్రైమ్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కర్నూలు రాక సందర్భంగా భద్రత పరంగా పకడ్బందీ ఏర్పాటు చేయాలని కర్నూలు రేంజ్ డీఐజీ సిహెచ్.విజయరావు, జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ పర్యటన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచించారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి మనుమడు పవన్‌కళ్యాణ్ వివాహానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 15న కర్నూలు బళ్లారి రోడ్డులోని కింగ్ ప్యాలెస్ గ్రాండ్ కన్వెన్షన్ పరిసరాలను, ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో భద్రత పరంగా పర్యటన ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు. బందోబస్తు విధుల్లో అడిషనల్ ఎస్పీ ఒకరు, నలుగురు డీఎస్పీలు, 16మంది సీఐలు, 17మంది ఎస్ఐలు, 63మంది ఏఎస్ఐలు హెడ్‌కానిస్టేబుళ్లు, 130మంది కానిస్టేబుళ్లు, 18మంది మహిళా పోలీసులు, 70మంది హోంగార్డులు, ఇతర జిల్లాల నుంచి అడిషనల్ ఎస్పీ ఒకరు, 5మంది డీఎస్పీలు, 9మంది సీఐలు, 30మంది ఎస్ఐలు, 50మంది ఏఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, 110మంది కానిస్టేబుళ్లు, 18 మంది మహిళా పోలీసులు, 50మంది హోంగార్డులు, 3స్పెషల్ పార్టీలు, 97మంది ఏఆర్ పోలీసులు బందోబస్తు విధుల్లో ఉంటారని తెలిపారు. సీఎం వచ్చే ముఖ్యమైన రహదారులను, రూట్ బందోబస్తును పరిశీలించారు. పోలీసు అధికారులకు, సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భార్గవతేజ, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ నాగరాజు, కర్నూలు సబ్‌డివిజన్ డీఎస్పీ విజయశేఖర్, ట్రైనీ డీఎస్పీ భావన, సీఐలు నాగరాజుయాదవ్, శ్రీనివాసరెడ్డి, శంకరయ్య, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బాలిక కిడ్నాప్ కేసులో ముగ్గురు యువకులకు రిమాండ్



**వెల్దుర్తి రూరల్ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని రామళ్లకోట గ్రామంలో ఫిబ్రవరి మూడవ తేదీన ఉదయం సమయంలో గ్రామానికి చెందిన లింగమయ్య అను వ్యక్తి రమల్లకోట మరియు ఇంకా ఇద్దరు వ్యక్తులు కలిసి మైనర్ బాలికను కిడ్నాప్ చేసినారని బాలిక నాయనమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించిన ముద్దాయిలు అయినా లింగమయ్య, జయరాముడు , శేఖర్ ని రామల్లకోట గ్రామంలో మంగళవారం అరెస్ట్ చేసి డోన్ కోర్టులో హాజరు పరచగా వారికి రిమాండ్ విధించడం జరిగిందని ఎస్ఐ తెలిపారు.బాలికను వారి నాయనమ్మకు, బంధువులకు అప్పగించడం జరిగిందన్నారు.

# దోమలు బాబోయ్..దోమలు

**దమలు నివారణకు చర్యలు తీసుకోవాలంటున్న జనం**

**పెద్దకడుబూరు,మేజర్‌న్యూస్ :** పెద్దకడుబూరు మండల పరిధిలోని కల్లుకుంట. కంభళదహాల్. కంభళదిన్నే, జాలవాడీ, చిన్నతుంభళం, పెద్దకడుబూరు, తారాపురం. హెచ్ మురువణీ. మేకడోనా. దొడ్డిమేకల. చిన్నకడుబూరు. ముచ్చిగేరి. బసలదొడ్డి. నాగాలపురం. తదితర గ్రామాల్లో పూర్తిగా పారిశుధ్యం లోపించిడం వల్ల దోమలు విపరీతంగా వృద్ధి చెంది ప్రజలకు కాటు వేయడంతో దురద విపరీతమైన నోప్పులు రావడంతో ప్రజలు దోమలు బాబోయ్ దోమలు అంటూ ప్రజలు, ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అలాగే వివిధ గ్రామాలలో మురుగు కాలువలో పూడిక పేరుకొనిపోయి దుర్వాసన వెదజల్లుతున్న గ్రామపంచాయతీ కార్యదర్శులు కాని, సర్పంచులు కూడా ఏమాత్రం పట్టించుకోవడం లేదని అయాగ్రామాల ప్రజలు తీవ్రంగా విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే గ్రామాలలో మురుగు కాలువలో నీరు నిల్వ ఉండడంతో విపరీతంగా దోమలు వ్యాప్తి చెందుతున్న కనీసం స్థానిక ప్రాథమిక వైద్య సిబ్బంది కూడా దోమలు నివారణ పై చర్యలు కూడా తీసుకోకపోవడం విచారకరమన్నారు. దోమలు వల్ల మలేరియా. డెంగ్యూ, టైఫాయిడ్ వంటి జబ్బులు సోకి వ్యాదుల బారినపడిన వైద్య సిబ్బంది ఏలాంటి చర్యలు తీసుకోవడం లేదని వైద్యులు పై ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనాజిల్లావైద్యాధికారులు స్పందించి దోమలు నివారణకు చర్యలు చేపట్టి ప్రజల యొక్క ఆరోగ్యం కాపాడాలని అయాగ్రామాల ప్రజలు అధికారులను కోరారు.

# సీమ పాలకుల నిర్లక్ష్యం..కృష్ణా జలాల కేటాయింపులో తీవ్ర వివక్షత

- **సాగునీటి అభివృద్ధిపై అశ్రద్ధ చేస్తున్న నేతలు**
- **సీమకు 15శాతం బడ్జెట్.. కోస్తాకు 85శాతం బడ్జెట్**
- **బొజ్జా దశరథరామిరెడ్డి**



బొజ్జా దశరథరామిరెడ్డి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** భారతదేశంలో అత్యంత తక్కువ వర్షపాతం కలిగిన రాయలసీమకు కృష్ణా జలాలు కేటాయింపులలో తీవ్ర వివక్షకు గురైందని ఇది చారిత్రక తప్పిదమని... సాగునీటి అభివృద్ధిపై పాలకులు అశ్రద్ధ వహించడం శోచనీయమని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథ రామిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం ఇతర అభివృద్ధి చెందిన కోస్తా ప్రాంతంతో సమానాభివృద్ధికి పాటుపడాల్సిన పాలకులు రాయలసీమకు కేవలం 15శాతం బడ్జెట్ కేటాయింపులు చేసి 85శాతం బడ్జెట్ నిధులు కోస్తా ప్రాంతానికి కేటాయించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. రాయలసీమ సమగ్రాభివృద్ధికి రాజకీయ పార్టీలు చేపట్టాల్సిన అంశాలను తమ ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చాలని కోరుతూ రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలకు దశరథరామిరెడ్డి లేఖ రాశామన్నారు. రాష్ట్ర విభజన జరిగిన పదేళ్లవుతున్నా విభజన చట్టంలో రాయలసీమకు కల్పించిన హక్కులను అమలుపరచడంలో పాలకులు విఫలమయ్యారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయలసీమ ప్రాంతం ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర ప్రాంతాలతో సమానంగా అభివృద్ధి చెందాలంటే రాయలసీమ సమగ్రాభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్‌లో సింహభాగం నిధుల కేటాయింపులు చేపట్టాలనిఆయన డిమాండ్ చేశారు. చెరువుల నిర్మాణం, పునరుద్ధరణ, పెన్నాది పునరుజ్జీవనానికి నిధులు కేటాయించి నిర్దిష్ట కాల వ్యవధితో రాయలసీమ ఇరిగేషన్ కమిషన్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. విభజన చట్టం అనుమతించిన తెలుగుగంగ, గాలేరు నగరి, హంద్రీనీవా, వెలిగొండ ప్రాజెక్టుల నిర్మాణానికి బడ్జెట్‌లో నిధులు కేటాయింపులు చేసి రెండు సంవత్సరాల కాలంలో పూర్తి చేయడమే కాకుండా పట్టిసీమ, పోలవరం ద్వారా ఆదా అయిన 80టిఎంసీల కృష్ణా జలాలను ఈ ప్రాజెక్టులకు నికర జలాలుగా కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పాలనా వికేంద్రీకరణలో భాగంగా రాజధాని లేదా హైకోర్టును కర్నూలులో ఏర్పాటు, రెండు తెలుగు రాష్ట్రాల మధ్య సరైన కృష్ణాజలాల నీటి పంపిణీకి అనువుగా కృష్ణానది యాజమాన్య బోర్డు కార్యాలయం కర్నూలులో ఏర్పాటు, ప్రత్యేక ప్యాకేజీ ద్వారా 35వేల కోట్లతో రాయలసీమ అభివృద్ధి చేపట్టాలని ఆయన కోరారు. రాయలసీమ ప్రాంతానికి అన్ని రాజకీయ పార్టీలు అండగా నిలబడాలని కోరారు.

# పెన్షన్లను నిరాకరిస్తున్న మండల అధికారులు

**కొలిమిగుండ్లమేజర్,న్యూస్ :** మండల కేంద్రమైన కొలిమిగుండ్లలోని చర్మ, డప్పు కళాకారుల పెన్షన్లను ఆన్‌లైన్ చేయమని కోరితే మండలస్థాయి అధికారులు నిర్లక్ష్యంగా మాట్లాడుతూ నిరాకరిస్తున్నారని ప్రభుత్వం పెన్షన్లకు సంతకాలు పెట్టకండి ఆన్‌లైన్ చేయకండి అని ప్రభుత్వం చెప్పిందని పదేపదే చెబుతూ చర్మ, డప్పు కళాకారులకు పెన్షన్లు ఆన్‌లైన్ చేయకుండా ఇబ్బందులు గురి చేస్తున్నారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అదేవిధంగా నిరుపేద మాదిగ చర్మ డప్పుకళాకారులకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

# బీజేపీ పల్లెబాట..ప్రజల్లోకి కేంద్ర పథకాలు

- **రాష్ట్రంలో నంద్యాల మొదటి స్థానం**
- **కన్వీనర్ అభిరుచి మధుకు రాష్ట్ర కమిటి కితాబు**
- **నాలుగురోజులపాటు గ్రామాల్లో విస్తృత ప్రచారం**
- **రాత్రి వేళల్లో బస**
- **ఆకట్టుకున్న సాంప్రదాయ దుస్తులు**
- **పాండురంగాపురంలో బ్రహ్మరథం**
- **నెహ్రూనగర్‌లో ముగింపు**



పాండురంగాపురం గ్రామస్తులను సన్మానిస్తున్న దృశ్యం



నెహ్రూనగర్‌లో సాంప్రదాయ దుస్తులతో బీజేపీ శ్రేణులు

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** సార్వత్రిక ఎన్నికలకు భారతీయ జనతా పార్టీ సన్నద్ధం అవుతుంది. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రధాన ఎజెండాగా ప్రజల్లోకి తీసుకొని వెళ్తుంది. బీజేపీ నాలుగురోజులపాటు పల్లెకు పోదాం పేరిట వార్డు, గ్రామాల్లో విస్తృతంగా పర్యటించింది. రాత్రి వేళల్లో ఆయా గ్రామాల్లో బీజేపీ శ్రేణులు బస చేశాయి. సాంప్రదాయ దుస్తుల్లో పల్లెకు పోదాం ఆకట్టుకుంది. రాష్ట్రంలో నంద్యాల అసెంబ్లీ మొదటి స్థానంలో నిలిచింది. నంద్యాల నియోజకవర్గంలోని 281 బూత్‌ల్లో 220 బూత్‌ల్లో పల్లెకు పోదాం పూర్తి చేసింది. ఈ నెల 9 నుంచి 12 వరకు నంద్యాల పట్టణంతోపాటు నంద్యాల, గోస్పాడు మండలాల్లోని, 42 వార్డులు, 34 గ్రామాల్లో పల్లెం పోదాం కార్యక్రమాన్ని చేపట్టింది. నంద్యాల కన్వీనర్ అభిరుచి మధుకు రాష్ట్ర కమిటి అభినందనలు తెలిపింది. పాండురంగాపురం గ్రామంలో గ్రామ ప్రజలు బ్రహ్మరథం పట్టారు. చివరి రోజు గోస్పాడు మండలం నెహ్రూనగరం గ్రామంలో పల్లెకు పోదాం కార్యక్రమం ముగిసింది. మిగిలిన 61 బూత్‌ల్లో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని చేపట్టేందుకు నంద్యాల బీజేపీ ప్రణాళిక రూపొందిస్తుంది. బీజేపి శ్రేణులు తమ పర్యటనలో కేంద్ర ప్రభుత్వం నిధులతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించడంలో సఫలీకృతమైంది. బడుగు, బలహీన వర్గాలకు కేంద్రం అమలు చేస్తున్న పథకాలకు అర్హులైన వారు ధరఖాస్తు చేసుకోవాలని కోరారు. పల్లెకు పోదాం విజయవంతంతో బీజేపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహంతో ఉరకలేస్తున్న నేపథ్యంలో మేజర్‌న్యూస్ అందిస్తున్న కథనం ఇది...

జిల్లాలోని నంద్యాల నియోజకవర్గంలో బీజేపీ ప్రజలతో మమేకం అవుతుంది. నంద్యాల కన్వీనర్‌గా అభిరుచి మధు బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లా కేంద్రంలో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్ర కమిటి పిలుపు మేరకు పార్టీ కార్యాలయాన్ని నంద్యాల ఎన్నికల కార్యాలయంగా మార్చారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని బీజేపీ పల్లెకు పోదాం కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ నెల 9 నుంచి 12 వరకు నియోజకవర్గంలోని వార్డుల్లో, గ్రామాల్లో పర్యటించి కేంద్రం పథకాలను వివరించడంతోపాటు స్థానిక సమస్యల గుర్తింపుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించింది. నంద్యాల నియోజకవర్గంలో 281 బూత్‌లు ఉండగా 220 గ్రామాల్లో పల్లెకు పోదాం నిర్వహించారు. నంద్యాల మున్సిపాలిటిలోని 42 వార్డులు గోస్పాడు మండలంలోని 16 గ్రామాలు, రెండు మజరా గ్రామాలు, నంద్యాల మండలంలోని 18 గ్రామాలతోపాటు రెండు మజరా గ్రామాల్లో పల్లెకు పోదాం చేపట్టాల్సి ఉండగా 220 బూత్‌ల్లో పూర్తి చేశారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గా ల్లో నంద్యాల నియోజకవర్గం మొదటి స్థానంలో నిలవడంతో రాష్ట్ర కమిటి నంద్యాల బీజేపీ కన్వీనర్ అభిరుచి మధును అభినందించింది. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు ఏమి చేయడం లేదన్న రాష్ట్ర ప్రభుత్వ ఆరోపణలను పల్లెకు పోదాంలో తిప్పి కొట్టారు. మన సంకల్పం వికసిత భారత్ పేరుతో కేంద్ర ప్రభుత్వం 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించింది. అందులో విశ్వ కర్మ యోజన పథకం క్రింద అర్హులైన వారందరికి రూ. లక్ష వరకు రుణాలు అందించడంతోపాటు ఉజ్వల యోజన పథకం క్రింద ప్రతి ఏడాది 3 సిలిండర్లను అందించడంతోపాటు చారిత్రాత్మక ప్రదేశాల పునరుద్ధరణ, అంకుర భారత్ పథకం సంస్థలకు ప్రోత్సాహం అందించడం, చోదకశక్తి స్వయం సమృద్ధ భారతం పథకం క్రింద గడచిన 9 ఏళ్ళలో రాష్ట్రానికి మంజూరు చేసిన నిధులు, ప్రగతి పథాన క్రింద విశాఖపట్నం అంతర్జాతీయ విహార నౌక టెర్మినల్ నిర్మాణంతోపాటు 72 రైల్వేస్టేషన్ల ఆధునీకరణ, నాలుగు వందేభారత్ రైళ్ళ నిర్వహణతోపాటు గిరిజన సమాజాలకు గౌరవం, హక్కులు, అవకాశాలు, పేదల కోసం కనీస సదుపాయాల కల్పన, సాధికారతపై మహిళలకు భరోసా, ఆయుష్మాన్ భారత్, అణగారిన వర్గాలకు సామాజిక భద్రత, రైతు సంక్షేమానికి భరోసా వంటి పథకాల క్రింద రాష్ట్రానికి చేకూరిన లబ్ధిని ప్రజలకు వివరించే ప్రయత్నం చేశారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై బీజేపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉన్న విషయాన్ని ప్రజలకు బీజేపీ శ్రేణులు తెలియజేశాయి. పల్లెకు పోదాంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సాంప్రదాయ దుస్తులతో పర్యటించారు.రాత్రి వేళల్లో ఆయా గ్రామాల్లోనే బసచేశారు. జాతీయ స్థాయి క్రీడాకారులకు సన్మానాలు, మాజీ సైనికులకు మిలిటరీ కుటుంబాలకు సన్మానాలతోపాటు ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో ప్రత్యేక పూజలతోపాటు అయోధ్యలో రామమందిర నిర్మాణాన్ని ప్రజలకు వివరించారు. రేషన్ బియ్యాన్ని కేంద్రం అందిస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్‌లో కేంద్రం వాటా రూ. 2 వేలు, తదితర అంశాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్ళారు. నంద్యాల బీజేపీ పల్లెకు పోదాం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కన్వీనర్ అభిరుచి మధు శ్రేణులను సమాయత్తం చేయడంతోపాటు పర్యవేక్షణ రాత్రి వేళల్లో నాయకులతో కలసి పల్లె నిద్ర చేయడంతో మొదటి స్థానాన్ని దక్కించుకుంది. రాష్ట్ర కమిటి నంద్యాల కమిటిని అభినందించడంతో బీజేపీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం కనిపిస్తుంది.